## యూత్ జోడో.. బూత్ జోడో రాష్ట్రంలోనే మెదక్‌కు మొదటి స్థానం

**-జిల్లా అధ్యక్షులు మహేందర్‌రెడ్డి**

**మెదక్ మున్సిపాలిటీ, మార్చి19 ప్రభాతవార్త:** ఆల్ ఇండియా యువజన కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యూత్ జోడో.. బూత్ జోడో కార్యక్రమంలో రాష్ట్రంలోనే మెదక్ మొదటి స్థానంలో నిలవడం జరిగిందని జిల్లా అధ్యక్షులు మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందరర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన ప్రతి ఒక్క కార్యక్రమం విజయవంత మైందని, అలాగే గతంలో రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర జిల్లాలో విజయవంతం కావడంలో యువజన కాంగ్రెస్ శ్రేణుల కృషి మరువలేనిదని అన్నారు. అలాగే ఆల్ ఇండియా యువజన కాంగ్రెస్ దేశ వ్యాప్తంగా చేపట్టిన యూత్ జోడో.. బూత్ జోడో కార్యక్రమంలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం గ్రామ గ్రామాన ఉన్న ప్రతి ఒక్క యువజన కాంగ్రెస్ కార్యకర్త ఎనలేని కృషి వల్లే సాధ్యమైందన్నారు. అందుకు ప్రతి ఒక్క యువజన కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా పని చేస్తూ మెదక్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ముందుకు కొనసాగుతామని ఆయన అన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## మల్లు స్వరాజ్యంకు ఘన నివాళులు

**కొమురవెల్లి, మార్చి 19, ప్రభాతవార్త :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో నేటి పాలకులు అనసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని సీపీఎం మండల కార్యదర్శి చెట్టిపల్లి సత్తిరెడ్డి పిలుపునిచ్చారు. మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సందర్భంగా కొమురవెల్లిలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో స్వరాజ్యం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అయన మాట్లాడుతూ నాటి దొరల జమీందారుల నైజం రాజాకారుల అరాచకాలకు వెట్టిచాకిరి విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరవనితగా కొనియడారు. అమె స్ఫూర్తితో నేడు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద ప్రజా వ్యతిరేక విధానాలపై అలుపెరుగని పోరాటాలు నిర్వహించిన నాయకురాలని అన్నారు. నేడు మహిళలు, యువకులు అమె పోరాటాలను అదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో రాంసాగర్ సర్పంచ్ తాడూరి రవీందర్, పార్టీ నాయకులు బదిపడగా కిష్టారెడ్డి,అతిని శారదా, తాడూరి మల్లేశం, బకెల్లి బాలకిషన్, నీల బిక్షపతి, సార్ల యాదయ్య, అరుట్ల రవీందర్, శ్రావనచారి పాల్గొన్నారు.



నీటిలో మునిగిన పొద్దుతిరుగుడు పంట

## గాలివాన బీభత్సం.. నేలరాలిన పంటలు...

**-పోతారం(జె)లో పిడుగుపడి రెండు గేదెలు మృతి**

**-హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లో నేలరాలిన మామిడి, వరి, మొక్కజొన్న పంటలు**

**హుస్నాబాద్, మార్చి 19, ప్రభాతవార్త :** హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెద మండలాల ప్రాంతంలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి గురై వరి, మొక్కజొన్న పంటలతో పాటు మామిడితోటలు ధ్వంసమయ్యాయి.దీంతో హుస్నాబాద్ మండలంలోని పోతారం(ఎస్)లో అజయ్‌రెడ్డికి సంబందించిన పడిగుడపడి పాడిఆవు మృతి చెందగా, మీర్జాపూర్‌లో మక్క,వరి పంటలు ధ్వంసమాయ్యాయి.దీంతో పాటు అక్కన్నపేట మండలంలోని పోతారం(జె)లో పిడుగుపడి రెండు గేదెలు మతి చెందాయి. కోహెడ మండలానికి సముద్రాల గ్రామానికి చెందిన గడ్డం శ్రీనివాస్‌రెడ్డికి చెందిన పొద్దుతిరుగుడు పంట రెండు ఎకరాలు నష్టం వాటిల్లగా, తాడిశెట్టి వెంకటవ్వకు చెందిన మామిడితోట మూడెకరాల్లో గాలివాన బీభత్సవానికి గురై మామిడి పిందెలు నేలరాలాయి. గుండా అయిలయ్యకు మూడు ఎకరాలు చెందిన మక్కజొన్న పంట మొత్తం నేలరాలి రైతు గుండెను పిండేసాయి.ఇదే గ్రామానికి చెందిన ఆరె లక్ష్మయ్యకు చెందిన మూడు ఎకరాలు సాగు చేస్తున్న మక్కజొన్న పంట నేలరాలి విధ్వంసం సృష్టించింది. తీగలకుంటపల్లి గ్రామానికి చెందిన మెట్టు సంజీవరెడ్డి,మెతుకు మోహన్‌రెడ్డిల మొక్క జొన్న పంట సైతం నేరరాలగా,కూకంట్ల శ్రీశైలం అనే రైతు పొద్దుతిరుగుడు పువ్వు చేను కోసి ఆరబెట్టిన పంట నీట మునిగి రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక రైతుకు చెందిన రెండు ఎకరాల్లో మామిడి నేలరాలి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.అక్కన్నపేట మండలంలోని పోతారం(జె) గ్రామానికి చెందిన రైతు చిర్రం జంగయ్యకు చెందిన కెండు పాడిగేదెలు పిడుగుపాటుకు గురై మృత్యువాతకు గురయ్యాయి.విషయం తెలిసిన గ్రామ సర్పంచ్ కరివేద ప్రమీలతో పాటు బిఆర్ఎస్ నాయకులు కరివేద నరేందర్‌రెడ్డి సంఘటనాస్థలాన్ని సందర్శించి ఆవేదన వ్యక్తం చేశారు.ఈ పంటనష్టం పై వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించి నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని,రెవెన్యూ అధికారులు పంట నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని రైతాంగం వేడుకొంటోంది.

### 31 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం : ఎవో



వర్షానికి నష్టపోయిన పంటను చూస్తున్న రైతు

**రామాయంపేట మున్సిపాలిటీ, మార్చి 19, ప్రభాతవార్త:** నిన్న కురిసిన అకాల వర్షానికి 31 ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలకొరికి నష్టం జరిగిందని మండల వ్యవసాయాధికారి రాజ్‌నారాయణ తెలిపారు. ఈ మేరకు మండల వ్యాప్తంగా 37.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసిందని వెల్లడించారు. ఈ వర్షానికి మండల పరిధిలోని కాట్రియాల, దంతేపల్లి, పర్వతాపూర్ గ్రామాలకు చెందిన 36 మంది రైతులకు సంబంధించిన 31 ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగిందని ప్రాథమిక అంచనా వేయడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

### 25న రేవంత్‌రెడ్డి ఖేడ్‌కు రాక

**నారాయణఖేడ్, మార్చి 19 ప్రభాతవార్త:** హత్ సే హత్ జోడో పాదయాత్రలో భాగంగా నారాయణఖేడ్ నియోజకవర్గానికి పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఈనెల 25న నారాయణఖేడ్‌కు రానున్నట్లు టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టరు పి.సంజీవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ కిష్టారెడ్డి గృహంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హత్‌సే హత్ జోడో పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు బోసురాజు కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పార్లమెంట్ కార్యదర్శి, నవీన్‌జావిద్ జహీరాబాద్ పార్లమెంట్ ఇంఛార్జి, రోహిత్‌చౌదరి ఏఐసీసీ సెక్రటరి,శ్రీధర్‌బాబు డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ తెలంగాణ రాష్ట్రం, అంజనికుమార్‌యాదవ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు రానున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని డాక్టరు పి.సంజీవరెడ్డి పిలుపునిచ్చారు.

**నేడు ఖేడ్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం:** నేడు సోమవారం నారాయణఖేడ్‌లో స్వర్గీయ పి.కిష్టారెడ్డి స్వగృహంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్నట్లు పీసీసీ ఉపాధ్యక్షులు డాక్టరు పి.సంజీవరిడ్డి తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ,అభిమానులు అధికసంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో భోజిరెడ్డి, దారం శంకర్‌సేట్, వివేకానంద, వినోద్‌పాటిల్, పండరిరెడ్డి, తదితరులు ఉన్నారు.

### సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి

**పాపన్నపేట, మార్చి 19, ప్రభాతవార్త:** సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షులుగా మండలంలోని మల్లంపేట గ్రామానికి చెందిన పుల్లన్న గారి శ్రీనివాస్‌రెడ్డిని ఎన్నుకున్నారు. శ్రీనివాస్‌రెడ్డి గత 15 సంవత్సరాలుగా సింగపూర్ సిటీ బ్యాంకులో ఉద్యోగం నిర్వహిస్తున్నారు. 1975లో సింగపూర్‌లో తెలుగు వారితో కలిసి అందరిని ఏకతాటిపైకి తెచ్చేందుకు సింగపూర్ తెలుగు సమాజం స్థాపించారు. సింగపూర్‌లో 40 నుంచి 50వేల మంది వరకు తెలుగు వారు ఉండగా సింగపూర్ తెలుగు సమాజంలో 9వేలకుపైగా సభ్యతం కలిగి ఉన్నారు. 5వేల మంది ఓటు హక్కును కలిగి ఉన్నారు. ఇటీవల సమాజం ఎన్నికలు నిర్వహించగా ఆదివారం ఓట్ల లెక్కింపు చేపట్టగా విజయవాడకు చెందిన బొమ్మరెడ్డి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. సమాజం ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్‌రెడ్డి ఎన్నిక కావడం పట్ల మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### దుర్గమ్మ క్షేత్రంలో భక్తుల కోలాహలం

**పాపన్నపేట, మార్చి 19, ప్రభాతవార్త:** ఏడుపాయల వనదుర్గా భవాని క్షేత్రం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. ఆదివారం సెలవురోజు కావడంతో ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పద్ద సంఖ్యలో చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులు తమ మొక్కుబడిలో భాగంగా అమ్మవారికి తలనీలాలు సమర్పించి మంజీరా పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి బోనాలతో చేరుకుని అందచేశారు. అమ్మవారికి కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు అమ్మవారి దర్శనానికి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటి చైర్మన్, ధర్మకర్తలు, ఆలయ ఇఓ, సిబ్బంది తగు చర్యలు తీసుకున్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులతో ఆలయ అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తూ పూజా కార్యక్రమాలు నిర్వమించారు.

# అకాల వర్షంతో పంటలకు అపార నష్టం

- నేలరాలిన మామిడి, కూరగాయలు
- తీవ్రంగా దెబ్బతిన్న పొద్దుతిరుగుడు, మొక్కజొన్న పంటలు
- ప్రభుత్వమే అదుకోవాలి.. రైతులు





బెజ్జంకి మొక్కజొన్నపంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రసమయి, వెంకట్రావుపేటలో పంటను పరిశీలిస్తున్న దృశ్యం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి/బెజ్జంకి/తొగుట, మార్చి 19, ప్రభాతవార్త :** జిల్లాలో శనివారం రాత్రి నుంచి అదివారం ఉదయం వరకు ఉరుములు మెరుపులు, గాలి దూమరంతో కూడిన అకాల వర్షం పడడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అకాల వర్షం మూలంగా జిల్లాలోని హుస్నాబాద్, గజ్వేల్, సిద్దిపేట, తొగుట, కోహెడ, బెజ్జంకి తదితర మండలాల్లో మామిడి, కూరగాయల తోటలతో పాటు మొక్కజొన్న, పొద్దు తిరుగుడు పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. చేతికి వచ్చిన పంటలు కళ్లముందే నేల రాలడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మామిడి, మొక్కజొన్న, కూరగాయల తోటలు, వరికి వేలాది ఎకరాల్లో నష్టం జరిగినట్లు రైతులు వాపోతున్నారు. కొద్ది గొప్ప కాసిన మామిడి తోటలు అకాల వర్షం మూలంగా నేలరాలిపోయాయి. కాగా జిల్లాలో సగటున 38.7 మీ.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా తొగుట మండలంలో 79.4 మీ.మీ అత్యల్పంగా వర్గల్ మండలంలో 2.4 మీ.మీ వర్ష పాతం నమోదైంది. మొత్తం అకాల వర్షానికి పంటలకు తీవ్రస్థాయిలో నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. అకాల వర్షం వలన పంటలు నష్టపోయిన ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, వ్యవసాయాధికారులు పర్యటించి పంటలను పరిశీలించారు. అకాల వర్షం మూలంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అదుకోవాలని రైతులు కోరుతున్నారు.

**బెజ్జంకిలో...**

ఆరుగాలం ఎంతోకష్టపడి పండించిన మొక్కజొన్న పంట మరో వారం రోజుల్లో చేతికొస్తుందని అశించిన రైతులకు మండల వ్యాప్తంగా రెండురోజులుగా కురుస్తున్న వర్షాలు తీవ్ర నష్టం చేకూర్చాయి. మండల పరిధిలోని వీరాపూర్ గ్రామంలో రైతు మామిడి సంపత్‌రెడ్డి మూడు ఎకరాల భూమిని కౌలు తీసుకొని మొక్కజొన్న పంటను సాగు చేయగా శనివారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడడంతో పూర్తిగా నేలమట్టమైందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అలాగే మండల వ్యాప్తంగా అయా గ్రామాల్లో 1200 ఎకరాలలో రైతులు మొక జొన్నపంటను సాగుచేయ గా 373 ఎకరాల్లో మొక్కజొన్న పంట 40 ఎకరా ల్లో పొద్దుతిరుగుడు పంటలకు పూర్తిగా నష్టం జరి గింది. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అదుకోవాలని కోరుతున్నారు. అకాల వర్షంతో నష్ట పోయిన పంటలను ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పరిశీలించారు.

**తొగుటలో...**

మండలంలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షంతో పొద్దుతిరుగడు, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. వెంకట్రావ్‌పేటలో నష్టపోయిన పంటలను ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు పరిశీలించారు. మండల వ్యాప్తంగా సుమారు 55 ఎకరాలు పొద్దుతిరుగుడు, 70 ఎకరాలలో మొక్కజొన్న పంటకు నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. పంటలను పరిశీలించిన వారిలో ఎంపిటిసి కంకణాల నర్సింలు, నాయకులు పాత్కుల వెంకటేశం, రైతుబంధు సమితి గ్రామ అధ్యక్షులు బండారు స్వామి, వ్యవసాయ అధికారి మోహన్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న రాజయ్య

## సిఎం కెసిఆర్ రాజీనామా చేయాలి

**-మాజీ ఎంపి సిరిసిల్ల రాజయ్య**

**హుస్నాబాద్, మార్చి 19, ప్రభాతవార్త :** సిఎం కేసీఆర్‌కు ఏ మాత్రం నైతికత ఉన్నా ముఖ్యమంత్రి పధవికి వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వరంగల్ మాజీ ఎంపి సిరిసిల్ల రాజయ్య డిమాండ్ చేశారు.ఆదివారం రోజున రాజయ్య వరంగల్ నుండి టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమావేశానికి వెల్తుండగా హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆగి పార్టీ శ్రేణులతో కలసి మాట్లాడారు.టిఎస్‌పిఎస్సి పరీక్ష పత్రాల లీకేజీ,లిక్కర్ స్కాంలో ముఖ్యమంత్రి కూతరు ఉండటం పట్ల కేసీఆర్ బ్యాదత వహించి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అటు కేంద్ర ప్రభుత్వం నిధుల దుర్వినియోగం చేసుంటే,ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్నారని మండిపడ్డారు.కేంద్రంలో కుల,మతాల రాజకీయాలు చేస్తున్న ప్రధానీ మోడీపై రాజద్రోహం కేసు పెట్టాలన్నారు.

**కెసిఆర్, కెటిఆర్ దిష్టిబొమ్మల దగ్ధం...**

టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజ్ వ్యవహారంపై టిపిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పిలుపుమేరకు హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పార్టీ నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్,మంత్రి కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను దగ్ధం చేసి రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు లక్షల మంది నిరుద్యోగులతో చెలగాటం ఆగిన టిఎస్‌పిఎస్‌సి చైర్మెన్‌ను వెంటనే విధుల నుండి తొలగించాలని,నష్టపోయిన నిరుద్యోగులకు లక్షరూపాయల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

### చెట్టు నరికిన వ్యక్తికి రూ.10 వేల జరిమానా

**సిద్ధిపేట రూరల్, మార్చి 19, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీలో నిబంధనలకు విరుద్ధంగా హరితహారంలో భాగంగా నాటిన మొక్కచెట్టుగా ఎదిగిన తర్వాత నరికివేసిన వ్యక్తికి మున్సిపల్ అధికారులు రూ.10 వేల జరిమానా విధించారు. పట్టణ మున్సిపల్ పరిధిలోని 20వ వార్డు పరిధిలో సయ్యద్ రియాజ్ హరితహారం చెట్టును నరికివేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు హరిత హారం అధికారి సామల ఐలయ్య సదరు వ్యక్తికి రూ.10 వేల జరిమానా విధించారు. హరిత హారంలో నాటిన మొక్కలను నరికి వేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

### భక్తులతో కిటకిటలాడిన మల్లన్న క్షేత్రం



స్వామి వారి దర్శనానికి తరలివచ్చిన భక్త జనం

**కొమురవెల్లి, మార్చి 19, ప్రభాతవార్త:** కొమురవెల్లి శ్రీమల్లికార్జున స్వామి క్షేత్రం అదివారం భక్తులతో నిండిపోయింది. చివరి అదివారం అగ్నిగుండాల కార్యక్రమాల సందర్భంగా 35 వేలకుపైగా భక్తులు తరలివచ్చారు. డిసెంబర్ మాసంలో ప్రారంభమైన మల్లికార్జునుడి బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది 9 వారాల పాటు కొనసాగాయి. శనివారం నుంచే భక్తులు స్వామి వారి క్షేత్రానికి చేరుకుని అలయ నిర్వహణలో ఉన్న డోనర్ల నిర్మించిన గదుల్లో, మరి కొ ందరూ ప్రైవేటు గదుల్లో బస చేశారు. అదివారం వేకవజామునే నిద్ర లేచిన భక్తులు గదులలో పవిత్ర స్నానం అచరించి స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో గంటల పాటు వేచి ఉన్నారు. సా వ్మివారి దర్శనం కోసం ఒక్కో భక్తుడు దాదాపు 3 గంటల నుంచి 5 గంటల పాటు వేచి ఉన్నారు. స్వామి వారి అలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకం, అర్చనలు, చిలుక పట్నం, నజరుపట్నం, మహా మండప పట్నాలు వేయించి పూజలు నిర్వహించారు. మరికొంత మంది భక్తులు తలనీలాలు సమర్పించి గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టి కోరికలు తీర్చాలని స్వామి వారిని వేడుకున్నారు. అలాగే స్వామి వారి గుట్లపై ఉన్న ఎల్లమ్మకు బోనాలు తీసుకుపోయి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సాయంత్రం క్షేత్రంలో కుటుంబ సభ్యులతో పాటు షాపింగ్ నిర్వహించి, స్వామి వారి చరిత్ర, బొమ్మలు,ప్రసాదాలను కొనుగోలు చేశారు. స్వామి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించే అగ్నిగుండాల కార్యక్రమాన్ని కనులార విక్షించేందుకు మల్లన్న క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు క్షేత్రంలో వేచి ఉన్నారు. ఈవో బాలాజీ, పాలక మండలి చైర్మన్ గీస బిక్షపతి, ధర్మకర్తలు నర్ర రఘువీరారెడ్డి, కొ ంగరి గిరిధర్, పచ్చిమడ్ల సిద్దిరాములు, కందుకూరి సిద్దిలింగం, చెట్కూరి తిరుపతి, ఏఈవో వైర్యాగం అంజయ్య, అలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకులు నీల శేఖర్, శ్రీనివాస్‌శర్మ, సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు సేవలందించారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ సందెపొగు మహేందర్, హుస్నాబాద్ ఏసీపీ సతీష్, చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి, చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు ఎస్ఐలు భాస్కర్‌రెడ్డి, చంద్రమోహన్, నారాయణలు బందోబస్తు నిర్వహించారు. కాగా వరంగల్ నగరంలోని కొత్తవాడకు చెందిన కుమారస్వామి అనే భక్తుడు స్వామి వారికి 450 గ్రాముల వెండి కిరీటాన్ని మొక్కు రూపంలో సమర్పించుకున్నారు.

### పంచాంగాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**మెదక్ అర్బన్, మార్చి19 ప్రభాతవార్త:** మెదక్ డివిజన్ బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లింగమూర్తి శర్మ, వైద్య శ్రీనివాస్ శర్మల ఆధ్వర్యంలో శోభకృత్ నామ సంవత్సర పంచాంగాన్ని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్ కొంపల్లిలోని వారి నివాసంలో ఆవిష్కరించారు. రాబోవు సంవత్సరంలోని రాశి ఫలితాలు, గ్రహణాలు, పుష్కరాలు, పండుగలు సమగ్రంగా పొందుపరిచిన మినీ పంచాంగం అందరికీ ఉపయోగపడుతుందని, రాబోవు శోభకృత్ నామ సంవత్సరంలో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని, అలాగే బ్రహ్మణుల ఆశీస్సులతో అందరూ బాగుండాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం వేద బ్రాహ్మణులు ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి దంపతులను సన్మానించి ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవాండ్ల కృష్ణమూర్తి, పోద్దార్ నరేంద్రబాబు, రాయారావు నర్సింగరావు, దేశాయిపేట నాగరాజుశర్మ, వైద్య రాజు, సుబ్రహ్మణ్యం, కాశీనాథ్, ప్రకాష్, శంకర్, ఫణి, రవి, వేణు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న రవిందర్‌గౌడ్

### పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**-రైతు ఐక్యత సంఘం నాయకులు రవిందర్**

**హుస్నాబాద్, మార్చి 19, ప్రభాతవార్త :** పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రైతు ఐక్య సంఘం నాయకులు పచ్చిమట్ల రవిందర్‌గౌడ్ డిమాండ్ చేశారు.ఆదివారం రోజున పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురుస్తున్న ఆకాల వర్షాలకు నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు తమ సాగు చేసుకున్న పంటలకు నష్టం వాటిల్లిందన్నారు.అంతే కాకుండా ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు లక్ష రూపాయల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో రైతులతో కలసి పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆశయ్య, నాగయ్య, రవిందర్, ఐలయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

### టిఎస్‌పిఎస్‌సి చైర్మన్‌ను భర్తరప్ చేయాలి

**-మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి**

**పాపన్నపేట, మార్చి 19, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రాంత పబ్లిక్ సర్వీస్ కమీషన్ చైర్మన్‌ను గవర్నర్ వెంటనే భర్తరఫ్ చేయాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం ద్వార సంక్రమించిన హక్కులతో తెలంగాణ గవర్నర్ తమిళసై జోక్యం చేసుకుని చైర్మన్‌ను వెంటనే తొలగించాలని సూచించారు. నిరుద్యోగుల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్‌ను వెల్లడిస్తే బోర్డు పేపరు లీకేజిలతకు పాల్పడుతూ టీఎస్‌పిఎస్‌సి చైర్మన్ అవినీతికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రస్తుత బోర్డును రద్దు చేసి కొత్త బోర్డును నియమించాలని శశిధర్‌రెడ్డి హితువు పలికారు.

### గురుకుల ప్రవేశపరీక్ష దరఖాస్తు పొడిగింపు

**మిరుదొడ్డి, మార్చ 19, ప్రభాతవార్త :** తెలంగాణ గురుకుల పాఠశాల 5వ తరగతికి చెందిన ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును ఈనెల 20 తేదీ వరకు పొడిగించినట్లు మిరుదొడ్డి గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డి.సుజాత తెలిపారు. ఇంత వరకు దరఖాస్తు చేసుకోని విద్యార్థులు ఉంటే త్వరగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష అనంతరం వెంట వెంటనే ఫలితాల వెల్లడించి సీట్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందన్నారు.

### ఆందోళనకు దిగిన భూ బాధితులు

**మిరుదొడ్డి, మార్చ 19, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కాసులాబాద్ గ్రామంలో అదివారం తాటి భానుచందర్ ఇంటి ఎదుట ఉద్రిక్తత నెలకొంది. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాసులాబాద్ గ్రామం రాగట్ల లింగం, నందం సంబంధించిన భూమిని అదే గ్రామానికి చెందిన తాటి భానుచందర్ ఎకరా 12గుంటల భూమిని అక్రమంగా స్వంతం చేసుకున్నారని తాటి భానుచందర్ ఇంటి ఎదుట భూ బాధితులు కుటుంబ సభ్యులతో కలిసి అందోళన చేపట్టారు. భానుచందర్ పరారీలో ఉన్నారు. తమ భూమి తమకు ఇచ్చే వరకు ఎన్ని రోజులైనా ఇక్కడే ఉంటామని బాధితులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే చట్ట పరంగా న్యాయం చేసి అదుకోవాలని కోరుతున్నారు.



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

### రాజ్యాంగబద్ధ సంస్థలను కాలరాస్తున్న మోది ప్రభుత్వం

**-సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు**

**జహీరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన సంస్థలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోది కాలరాస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని సుభాష్‌గంజ్‌లో బిజెపి హటావో, దేశం బచావో కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై కేంద్రం తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సాంబశివరావు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలను ఎదగనీయకుండా అక్రమంగా సిబిఐ ఈడి, ఐటి సంస్థలతో దాడులు చేయిస్తూ వారిపై కుట్రలు పన్నుతున్నారని విచారం వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులతో ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు మండిపడ్డారు. ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తూ కేంద్రం పాలన చేయడం ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసే యత్నం చేస్తోందని కేంద్రం తీరుపై మండిపడ్డారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి సుసోడియ, తెలంగాణ ఎమ్మెల్సీ కవితలపై అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి నాయకులు గాలి జనార్ధన్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి ఎడ్యూరప్పలపై వచ్చిన ఆరోపణలకు ఎలాంటి దాడులు జరగకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

### మహిళా హక్కులను పోరాడి సాధించుకోవాలి

**-జాతీయ మహిళా సామఖ్య అధ్యక్షురాలు సృజన**

**హుస్నాబాద్, మార్చి 19,ప్రభాతవార్త :** మహిళా హక్కులను పోరాడి సాధించుకోవాలని సాధించుకోవాలని తెలంగాణ రాష్ట్ర భారత జాతీయ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తేల సృజన అన్నారు.ఆదివారం రోజున పట్టణంలోని అణభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంకు గూడ పద్మ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో సగభాగం మహిళలు ఉన్నారని,తమకు కావాల్సిన హక్కులను పోరాటాల ద్వార మాత్రమే సాధ్యమౌతుందన్నారు.కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా నిర్మాణ బాద్యులు కనుకుంట్ల శంకర్,జిల్లా కార్యదర్శి పిల్లి రజిని, మమత, నిర్మల, స్వామి, శోభ, సంగీత, మంజుల, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

### వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రాన్ని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

**వర్గల్, మార్చి 19 (ప్రభాతవార్త):** తెలంగాణ జిల్లాల్లో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న శ్రీ విద్యాధరి క్షేత్రాన్ని ఆదివారం హైకోర్టు జడ్జి వెంకటేశ్వర్‌రెడ్డి దర్శించుకొని విద్యాసరస్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు ఆయనను అమ్మవారి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. అంతకు ముందు ఆలయ మేనేజర్ రఘుపవన్ నేతృత్వంలో అర్చకులు, ఆలయ సిబ్బంది హైకోర్టు జడ్జి వెంకటేశ్వర్‌రెడ్డి పరివారానికి స్వాగతం పలికారు. ఆయన వెంట జిల్లా జడ్జి రఘురాం తదితరులు ఉన్నారు.

# పావల వడ్డీ బకాయల వినియోగంపై ప్రభుత్వం ఆంక్షలు

**డిఆర్‌డిఓ ఉత్తర్వులపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న మహిళా సంఘాలు**

**నిబంధనలతో ఎవరి బకాయలు వారికి దక్కని వైనం**

**ఉత్తర్వులు ఉపసంహరించాలని డిమాండ్**

**సంగారెడ్డి బ్యూరో మార్చి 19, ప్రభాతవార్త:** జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం విడుదల చేసిన పావలవడ్డీ రుణాలపై పెట్టిన ఆంక్షలపట్ల పలు సంఘాల సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు సంవత్సరాలకు సంబంధించిన బకాయలు రావలసి ఉండగా, ప్రభుత్వం వారం క్రితం రెండు సంవత్సరాలవి మాత్రమే విడుదల చేసింది. ఇంకా రెండు సంవత్సరాల బకాయలు విడుదల చేయాల్సి ఉంది. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లాలోని 15652 సంఘాలకు 2018-19, 2019-20 ఆర్థిక సంవత స్రరానికి సంబంధించిన రూ. 50.69 కోట్లు విడుదల చేసింది. బకాయలు విడుదలచేసిన ప్రభుత్వం వాటిని సంఘాల సభ్యులు వినియోగించుకునే విషయంలో నిబంధనలు పెట్టిందని పలు సంఘాల సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మాకు వ్యక్తిగతంగా రావలసిన నిధులను, అలావాడుకోకుండా ఆంక్షలు పెట్టడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన పావల వడ్డీ రుణాల వినియోగానికి సంబంధించి డిఆర్‌డిఓ పిడి శ్రీనివాసరేవు పేరుతో లేఖ సంఖ్య ఎఫ్1/ బిఎల్ /ఎస్ఆర్‌డి/2023 పేరుతో ఒక సర్క్యులర్ జారీ చేశారు. అదే సంఘాంలోని సభ్యులకు అప్పులుగా ఇవ్వాలని, అప్పులు ఇచ్చిన వారి పేర్లు నమోదు చేయాలని, వాటికి సంబంధించిన నెలనెల వడ్డీ, అదే సంఘం పొదుపు ఖాతాలో చెల్లించాలని, అలా అప్పు తీసుకున్న సభ్యులు మొత్తం అప్పు చెల్లించే వరకు వివరాలు నమోదే చేసి, సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన మాఫీని సంఘం కోసం మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుందని, దీనిని ఎస్‌హెచ్‌జి ఆప్ అకౌంటింగ్‌లో ఎంట్రీ చేసి, ప్రతి నెల డిసిబి ప్రకారం లెక్కలు చూపాల్సి ఉంటుందని, దీనికి విఓఏలు, సిసిలు, ఎపిఎంలు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని లేఖలో పేర్కొన్నారు. ఇందులో ఎలాంటి అవకతవకలు జరిగినా, అక్రమాలు జరిగినా సంబంధిత వారిపై సెర్ప్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని లేఖలో పేర్కొన్నారు. వ్యక్తిగతంగా రావలసిన బకాయిలను సంఘంలో కలిపి అప్పులు తీసుకోవాలని అదేశించడం ఏమిటని పలు సంఘాల సభ్యులు ప్రశ్నిస్తున్నారు. ఇతర జిల్లాలో ఇలాంటి అభ్యంతరాలు లేకపోయినా, సంగారెడ్డి జిల్లాలోనే ఆమలు చేయాలని ఆదేశించడం ఎమిటని వారు ప్రశ్నిస్తున్నారు.ఎప్పుటికప్పుడు చెల్లించాల్సిన పావల వడ్డీ బకాయలను, నాలుగు సంవత్సరాల తర్వాత ఇచ్చి, నిభంధనలు పెట్టడం ఎమిటని వారు విమర్శిస్తున్నారు.

ఈ విషయమై డిఆర్‌డిఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన పావలవడ్డీ బకాయలు సంఘాల పొదుపు ఖాతాలలో జమచేయడం జరిగిందన్నారు. వాటిని సంఘాల కోసం వినియోగించుకోవాలని పేర్కొన్నమాట వాటవాస్తమేనని అన్నారు. పావలవడ్డీ బకాయలు సంఘం కోసం ఉపయోగించుకుంటే తప్పులేదుకదా అన్నారు. సంగారెడ్డి జిల్లాలోనే నిభధనలు ఆమలు చేయడంలేదని, సెర్ప్ ఆదేశాలమేరకు ఉత్తర్వులు ఇచ్చామన్నారు.



అనుమతి లేకుండా టవర్‌లైన్ పిల్లర్ వేసిన ప్రాంతంలో ఆందోళన చేస్తున్న రైతులు

## రైతుల అనుమతులు లేకుండా విద్యుత్ టవర్‌లైన్స్ ఏర్పాటు చేయడం అన్యాయం

**కందుకూరు, మార్చి 19, ప్రభాతవార్త:** రైతులకు నష్టం కల్గించే విధంగా పవర్‌గ్రిడ్‌కు వెల్లే విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడం అన్యాయమని ఈ విషయంలో ప్రభుత్వం చొరవచూపి రైతులకు అన్యాయం జరుగకుండా చూడాలని మీర్ఖాన్‌పేట గ్రామానికి చెందిన రాధికారెడ్డి, కాకి పెద్ద సత్తమ్మ, కాకి చిన్న సత్తమ్మలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై టవర్‌లైన్ ఏర్పాటు చేసే ప్రాంతంలో అ ప్రాంత రైతులతో కలిసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనాదిగా భూమిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని మావి చిన్న కుటుంబాలని ఉన్న పొలం నడిమధ్యలో విద్యుత్ టవర్‌లైన్‌లు ఏర్పాటు చేయడం వలన తీవ్రంగా నష్టపోవలసి వస్తుందన్నారు. ఈ ప్రాంతంలో టవర్‌లైన్‌లు వేస్తున్న వరోర కుర్‌నూల్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఇటీవల పరిసరాలలో రైతులకు తెలియకుండానే నిర్మా నాలు చేపడుతూ లైన్లు వేసిన కొన్ని పొలాల రైతులకు నష్ట పరిహారం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారుపోయారు. ఈ విషయంలో రైతులకు అన్యాయం జరుగకుండా చూడాలని ఇప్పటికే లైన్లు నిర్మించిన ప్రాంతాలలోని రైతులకు తగిన నష్టపరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు. నర్సింహ్మా, సంతు, శంకర్, సత్తయ్య, రవి, శ్రీరాములు, వెంకటయ్య, శంకరమ్మ, రాము తదితరులు పాల్గొన్నారు.

## నేడు కల్వకుర్తిలో బిజెపి మహాధర్నా

**ఆమనగల్లు, మార్చి19, ప్రభాతవార్త:** టీఎస్‌పిఎస్‌సి అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మహాధర్నా నిర్వహిస్తుందని పార్టీ శ్రేణులు ఒక ప్రకటనలో తెలిపారు. మహాధర్నాకు జాతీయ ఓబిసీ కమీషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ముఖ్య అతిథిగా హాజరై ధర్నాలో పాల్గొంటారని వారు చెప్పారు. ఉదయం 10 గంటలకు కల్వకుర్తి తహశీల్దార్ కార్యాలయం ఎదుట మహాధర్నా కొనసాగుతందని, టీఎస్‌పిఎస్‌సి అసమర్థతతో పేపర్ లీకేజీలు జరిగాయని, ప్రభుత్వం నైతిక బాధ్యత తీసుకోవాలని, నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటమాడుతున్న రాష్ట్ర ప్రభుత్వంపై బిజేపి అలుపెరుగని పోరాటం హెచ్చరించారు. మహాధర్నాను విజయవంతం చేసేందుకు నియోజకవర్గ పార్టీ శ్రేణులు, నిరుద్యోగులు, యువతియువకులు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

## విద్యారంగ సమస్యలపై గళమెత్తండి

-మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి



నూతన అధ్యక్షుడు ఫరీద్‌కు నియామకపు పత్రం అందజేస్తున్న ఏఐసిసి సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి

**ఆమనగల్లు, మార్చి19, ప్రభాతవార్త:** విద్యారంగంలో అనేక సమస్యలు వెంటాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే, ఏఐసిసి సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో ఖాళీలు వేధిస్తున్నాయని, మౌలిక వసతులు కరువై విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగంలో వేధిస్తున్న సమస్యలపై ఎన్ఎస్‌యుఐ శ్రేణులు అలుపెరుగని పోరాటం చేయాలని వంశీచంద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం పర్యటించిన ఆయన ఎన్ఎస్‌యుఐ మండల నూతన అధ్యక్షుడుగా నియమితులైన ఫరీద్‌కు టిపీసిసి సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు మండల పార్టీ అధ్యక్షుడు మంగ్లి రాములుతో కలిసి వంశీ నియామకపు పత్రం అందజేసి అభినందించారు. విద్యార్థి లోకం ఎదుర్కుంటున్న సమస్యలపై పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో డీసిసి ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ్మా, కడ్తాల్ ఎంపిటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎంఎ ఖలీల్, ఆమనగల్లు టౌన్ పార్టీ అధ్యక్షుడు వస్పుల మానయ్య, కడ్తాల్ మండల పార్టీ అధ్యక్షుడు బిచ్యానాయక్, నాయకులు చేగూరి వెంకటేశ్, కృష్ణనాయక్, కొప్పు రాఘవేందర్ పాల్గొన్నారు.

## 21న మైనార్టీ కార్పోరేషన్ రుణ లబ్దిదారుల ఎంపిక

**తాండూరు, మార్చి 19, ప్రభాతవార్త :** తాండూరు మున్సిపల్ పరిధిలో మైనార్టీ కార్పొరేషన్ ద్వార 2022- 23 సంవత్సరమునకు సంబంధించి వ్యక్తిగత రుణాల కోసం ఆన్‌లైన్ ఫోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులను ఎంపిక కార్యక్రమం ఈనెల 21న నిర్వహించనున్నట్లు తాండూరు మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11గంటలకు తాండూరులోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో లబ్దిదారుల సంయుక్త ఎంపిక శిభిరం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తు దారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న ధరఖాస్తు ఫారం, అధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ తదితర పత్రాలు తీసుకొని ఇట్టి శిభిరానికి హాజరుకావాలని తెలిపారు.

## రక్తదాన శిబిరం విజయవంతం



రక్త దానం చేస్తున్న యువకులు

**మేడ్చల్, మార్చి 19. ప్రభాతవార్త :** మేడ్చల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మేడ్చల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. యువకులు పాల్గొని రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు అంజనేయులు, నాయకులు శ్రీకాంత్, రాజు, హేమలత, ప్రేమ్‌దాస్, ఈశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, సంతోష్, వంశీ, భరత్ తదితరులు పాల్గొన్నారు,

### ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం

నోటి ఆరోగ్యం అనేది ప్రతీ ఒక్కరికి ఎంతో ఆవశ్యకం. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 3.5 బిలియన్ల మంది ప్రజలు నోటికి సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్నారు. క్లోవ్ డెంటల్ వీటికి పరిష్కారాన్ని కనుగొన్నది. భారతదేశంలో డెంటల్ క్లినిక్‌ల అతిపెద్ద నెట్‌వర్క్ క్లోవ్ డెంటల్ ప్రారంభమైంది. అప్పటి నుంచి ప్రజలకు నోటి ఆరోగ్యాన్ని అందించేందుకు కట్టుబడి నిబద్ధతతో పనిచేస్తుంది.



దళితుల ఇండ్లలోకి చేరిన నీరు



బాధితులు గ్రామంలోని మెథోడిస్ట్ చర్చీలో బసచేసిన దృశ్యం

# వర్షం వస్తే ఇళ్లల్లోకి నీరు

**- సురంగల్ గ్రామంలో ఘటన.. ప్రభుత్వ ఆదుకోవాలని వినతి**

**మొయినాబాద్, మార్చి 19, ప్రభాతవార్త :** వాన చినుకుపడితే దళితుల ఇండ్లు, బ్రతుకులు వెక్కిరిస్తున్నాయి. మొయినాబాద్ మండలంలోని సురంగల్ గ్రామంలో వాన చినుకుపడితే దళితుల ఇండ్లలోకి మోరి మురుగు నీరుచేరి వారి బ్రతుకులను వెక్కిరిస్తున్నాయి. శనివారం కురిసి భారి వర్షానికి గ్రామంలోని ఐదు, ఆరో వార్డుల్లోని రామగళ్ల మాన్యమ్మ, రామగళ్ల మాణ్యిక్యం , ఎర్రోళ్ల నర్సింహ, రామగళ్ల నర్సింహల ఇండ్లలోకి మురుగునీరు చేరుతుంది. గ్రామానికి చివరిగా ఉన్న ఇండ్లు కావడంతో నీరు చేరుతుందన్నారు. బాధితులు మాట్లాడుతూ ప్రతి వర్షకాలంలో మాకు ఈ దుస్థితి తప్పడంలేదంటున్నారు. ఈ సమస్య కు చాల రోజుల నుండి ఉందని బాధితులు అంటున్నారు, ఈ సమస్య పరిష్కారానికి అండర్‌డ్రైనేజ్ వేసినా సమస్యకు పరిష్కారం లభించలేదంటున్నారు, ఇంటిలోకి నీరు చేరి ఇంట్లో ఉన్న సామాగ్రీ నీటిలో తేలాడుతు వారి బ్రతుకులను వెక్కిరిస్తున్న దుస్థితిని చూసి చుట్టు ప్రక్కల స్దానికులంతా ఆవేధన వ్యక్తం చేశారు, బాధితులు మాట్లాడుతూ నిత్యావసర సరుకులు నీటిలో మునిగిపోయాయని, బియ్యం, పప్పులు పూర్తిగా తడిచిపోయా యన్నారు, ప్రతి నెలకు సరిపడే సరుకులు నీటుపాలయ్యాయని గోడును వెల్లబోసుకున్నారు, మాకు వెంటనే మాకు శాశ్వత మార్గం చూపాలని అన్నారు, మాకు కొత్త ఇండ్లు కట్టుకునే ఆర్థిక స్దోమతలేదని ప్రభుత్వం నుండి ఏదైనా మాకు ఆర్థిక సహయం అందించాలని డిమాండ్ చేశారు, డబుల్ బెడ్రూమ్ ఇల్లు ఇవ్వాలని కోరా రు, రాత్రంతా నీరు ఎత్తిపోసినా ప్రయోజనం లేకపోవడంతో గ్రామంలోని మెథోడిస్ట్ చర్చిల్లో బసచేశామని తెలిపారు. గ్రామ సర్పంచ్ గడ్డం లావణ్య అంజిరెడ్డి మాట్లాడుతూ....గ్రామంలో ఆండర్ డ్రైనేజ్ వేసి ప్రతి కాలనీల్లో వర్షకాల వర్ధ సమస్యలను అరికట్టామని, 5,6 వార్డులోని నాలుగు ఇండ్ల కోసం పూర్తిగా అండర్‌డ్రైనేజ్ కాలువను వేసామని, వర్ధప్రవాహం ఎక్కువ ఉన్నప్పుడు, వారి ఇండ్లు, లోతట్టు ప్రాంతంలో ఉన్నందువల్ల ఈ సమస్య పునారావృత్తం అవుతుందని, త్వరలోనే ఈ సమస్యకు పరిష్కార మార్గం చూపుతామన్నారు,

## ప్రశ్నపత్రం లీకేజి దోషులను కఠినంగా శిక్షించాలి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**యాచారం, మార్చి 19 ప్రభాతవార్త**

టిఎస్‌పిఎస్‌సి పరీక్షా పేపర్లు లీకవడాన్ని నిరసిస్తూ టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు టిపిసిసి ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం మస్కు నర్సింహ అధ్యక్షతన మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌర స్తాలో ముఖ్యమంత్రి కెసిఆర్, ఐటి, పురపాలకశాఖ మంత్రి కెటిఆర్‌ల దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యంగా కారణంగానే ప్రశ్నాపత్రాలు లీకయ్యాయన్నారు. పరీక్షల రద్దుతో నిరుద్యోగుల జీవితాలు నాశనమవుతున్నాయన్నారు. పేపర్ లీకేజి కుట్రలకు భాద్యులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కోరే జగదీష్‌రావు, ముచ్చర్ల సంపత్‌కుమార్, తాడిపర్తి సర్పంచ్ దూసర రమేష్, నడ్డి విజయ్, యూత్ కాంగ్రెస్ మండల కార్యదర్శి పాశం జయప్రకాష్, గొట్టం మహేష్, కోటిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, కందుకూరు బాలరాజు, మద్దెల వెంకటేష్, బడేకుమార్, ముంత గణేష్, బండ రాజు, జమ్మ గుండాలు, ప్రకాష్, గోరింక సురేష్, పోలే మహేష్, పోలే వంశీ, కాలే కుమార్, బైండ్ల రవీందర్, తలారి మహేష్, కాస నాగరాజు, కాలే లింగం, కంబలపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతో మనస్సు ప్రశాంతత

**కొత్తూర్, మార్చి 19, ప్రభాతవార్త :**

అంగరంగ వైభవంగా శ్రీలింగ బసవేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బసవేశ్వర స్వామి ఎంతో ప్రసిద్ధిగాంచిన దేవస్థానం అని ఎంపిపీ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కొత్తూర్ మండలంలోని వైఎం తండాలో సర్పంచ్ అరుణరమేష్‌నాయక్ ఆధ్వర్యంలో శ్రీలింగ బసవేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అతి వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిపీ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... వైభవంగా శ్రీలింగ బసవేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సర్పంచ్ ప్రత్యేకంగా చొరవ చూపి బ్రహ్మాండంగా నిర్వర్తించడం ఎంతో శుభపరిణామం ఆధ్యాత్మికత అలవర్చుకున్న చోటే ప్రశాంతత నెలకొంటుంది. ప్రతి ఒక్కరు బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ రవినాయక్, ఎంపిటీసీ దాక్యచంద్రనాయక్, ఉపసర్పంచ్ దశరథ్‌నాయక్, గ్రామ కమిటీ అధ్యక్షులు జయేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, గూడూర్ రాజు, శంకర్, బాబు రాజ్, రవినాయక్, నరేష్‌నాయక్, తండా పెద్దలు, తండావాసులు ఉన్నారు.



ఎంపీపీ మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న సర్పంచ్ తదితరులు



ఇంటింటికి బిజెపి కార్యక్రమంలో నేతలు

## రాష్ట్రంలో బిఆర్ఎస్ పాలన అవినీతిమయం

**తాండూరులో జోరుగా ఇంటింటికి బిజెపి**

**తాండూరు, మార్చి 19, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పాలన అవినీతిమయంగా మారిందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీకృష్ణగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రమేష్‌కుమార్‌లు విమర్శించారు. ఇంటింటికి బిజెపి కార్యక్రమం తాండూరులో జోరుగా నిర్వహించారు. బిజెపి పట్టణ శాఖ ఆద్వర్యంలో ఐదవ రోజు పట్టణంలోని 16,19 వార్డులలో ఇంటింటికి బిజెపి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ముగింపు కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీకృష్ణగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రమేష్‌కుమార్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోడి పాలనలో ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పాదయాత్ర కొనసాగించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. పట్టణ ప్రజల్లో ప్రధాని నరేంద్రమోడి పాలన పట్ల ప్రజల్లో అపూర్వస్పందన కనిపిస్తుందని అన్నారు. ఒక అవినీతిమచ్చ లేకుండా భారత ఖ్యాతిని నలు దిశలా విస్తరిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని, భారత దిగుమతి చేసుకునే స్థాయి నుండి ఎగుమతి చేసుకునే స్థాయికి చేరడం నరేంద్రమోడి పాలనకు నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పాలన అవినీతిమయంగా మారిందని, ప్రభుత్వం గారడి మాటలతో ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై ప్రజలు విసుగెత్తిపోతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదన్నారు. రాష్ట్రం డబుల్‌ఇంజన్ సర్కార్ ఏర్పాటు ఖాయమని ధీమావ్యక్తం చేశారు. తాండూరులో బిజెపి జెండా ఎగురవేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు సుదర్శన్‌గౌడ్, ఇంచార్జ్ హనుమంతు, జిల్లా మహిళామోర్చా అధ్యక్షురాలు సాహు శ్రీలత, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అంతారం లలిత, కౌన్సిలర్లు బాలప్ప, నాయకులు బంటారం భద్రేశ్వర్, శ్రీకాంత్‌రెడ్డి, కిరణ్, జుంటుపల్లి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## దైవచింతనతోనే మనస్సుకు ప్రశాంతత



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

**శంకర్‌పల్లి, మార్చి 19, ప్రభాతవార్త :**

దైవచింతనతోనే మనస్సుకు ప్రశాంతత ఉంటుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. ఆదివారం శంకర్‌పల్లి మండలం శేరిగూడ గ్రామంలో మల్లన్న కళ్యాణం, జాతర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. ఈకార్య క్రమంలో ఎంపిపీ గోవర్ధన్‌రెడ్డి, ఏఎంసీ చైర్మెన్ పాపారావు, గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల సంఘం ఉపాధ్యక్షులు సత్యనారాయణ, ఉపసర్పంచ్ ఇంద్రసే నారెడ్డి, వార్డు సభ్యులు శ్రీనివాస్‌యాదవ్, కౌన్సిలర్ శ్రీనాథ్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రవీణ్‌కుమార్, గోపాల్, కురుమ సంఘం సభ్యులు, గ్రామస్థులు ఉన్నారు.

## ఉన్నత చదువులు చదివి వృద్ధిలోకి రావాలి

-పెదవీడు గ్రామ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్

**షాబాద్, మార్చి 19, ప్రభాతవార్త :** విద్యార్థులు ఉన్నత చదువులు చదివి అత్యున్నత స్థానానికి ఎదగాలని పెదవేడు గ్రామ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ అధికారి సివిఎల్ నారాయణలు తెలిపారు. బాబు జగ్జీవన్‌రామ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నారాయణగూడ విద్యార్థులు ఆదివారం షాబాద్ మండల పరిధిలోని పెదవేడు గ్రామంలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపును నిర్వహించారు. విద్యను మధ్యలో నిలిపివేయకుండా ఉండేందుకు, డిగ్రీ కళాశాల 50మంది విద్యార్థులు ఈ కార్యక్రమాని న్న వారం రోజులపాటు కొనసాగించనున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... విద్య ప్రాముఖ్యతను తెలుపుతూ ఉన్నత విద్యనభ్యసించాలన్నారు. కరోనా సమయంలో నీ పరిస్థితులు ప్రస్తుత సమాజిక పరిస్థితులపై ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులను సమాజంలో మమేకం చేయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయో గపడుతాయన్నారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, బీఎస్సీ పిజికల్ సైన్స్, బీబీఏ విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

## కళ్లను జాగ్రత్తగా చూసుకోవాలి: డైరక్టర్

**ఘట్‌కేసర్, మార్చి 19, ప్రభాతవార్త:** మనిషికి నేత్రాలు అత్యంత ప్రధానమని ఎన్ఎన్ఆర్‌జిఐ డైరక్టర్ సివి.క్రిష్ణారెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడలోని నల్ల నర్సింహ్మారెడ్డి అటానమస్ కళాశాలలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిభిరంలో ఆయన మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విన్ విజన్ ఐ ఆసుపత్రి సహకారంతో విద్యార్థులకు, బోధన, బోధనేతర సిబ్బందికి కంటి పరీక్షలుచేశారు. తరచుగా కంటి పరీక్షలు చేయించుచుకుంటే ఏమైనా సమస్యలు వస్తే చికిత్స చేయించుకోవడం, చూపు లోపం ఉంటే కళ్ల జోళ్లు పొందాలని సూచించారు. ఈకార్యక్రమంలో వివిధ విభాగాల డీన్లు, అధిపతులు, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త రాజేందర్‌గౌడ్, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణదేవ్‌కు పిహెచ్‌డి డిగ్రీ ప్రదానం

**జిల్లెడు చౌదరిగూడ, మార్చి 19,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ముష్టిపల్లి గ్రామానికి చెందిన కృష్ణదేవ్ ఉస్మానియా యూనివర్సిటి ఆర్ట్స్ కాలేజిలో యోగాంగా డ్రైస్ట్యా మహాభారత శాంతి పర్యాధ్యాయనం అనే అంశంపై పిహెచ్‌డి డిగ్రీని డాక్టర్ విద్యానంద్ ఆర్య చేతుల మీదుగ అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం ముష్టిపల్లి గ్రామంలో కృష్ణదేవ్‌ను ఎంపిటిసి సత్యప్రమోద్‌రావు, మాజి పిఏసిఎస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి గ్రామస్తులు శాలువాలతో సన్మాణించారు. ప్రతి ఒక్కరు కృష్ణదేవ్‌ను ఆదర్శంగ తీసుకుని ముందుకు సాగాలని వారు సూచించారు. మారు మూల గ్రామం నుంచి ఉన్నతమైన స్థాయికి ఎదిగినందుకు వారు ప్రత్యేకంగ కృతజ్ఞతలు తెలిపారు.

# ఆరోగ్యశ్రీలో లేని రోగాలకు సేవా నీరతితో వైద్యం అందించాలి

## వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

**ఆమనగల్లు, మార్చి19, ప్రభాతవార్త:** పేద, మధ్య తరగతి వర్గాల రోగులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం ఎంతో మేలు చేస్తుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆరోగ్యశ్రీ పథకం పరిధిలోకి రాని జబ్బులకు అవసరమైన చికిత్సలను ప్రైవేటు ఆసుపత్రులు మానవతా దృక్పథంతో తక్కువ ఖర్చుతో పేదలకు వైద్యం అందించాలని ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆమనగల్లు పట్టణంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఉచిత గుండె పరీక్షల శిబిరాన్ని ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్, నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి మంత్రి సింగిరెడ్డి నిరం జన్‌రెడ్డి ప్రారంభించారు. ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డు, హైదరాబాద్ కాచిగూడ ప్రాంతానికి చెందిన ప్రతిమ హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా, మంత్రి ప్రారంభించారు. అంతకు ముందు మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథులకు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కాచిగూడ కార్డియాలజీ వైద్య బృందం డా, రాజ్‌కుమార్‌యాదవ్, విక్రమ్‌గౌడ్‌లు, స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు పత్య



ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

నాయక్, సయ్యద్ ఖలీల్, రమేశ్‌నాయక్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, ఎంపిటీసీలు దోనాదుల కుమార్, సరితపంతునాయక్, సుర మళ్ళ సుభాష్, జైపాల్‌రెడ్డి, లాలయ్యగౌడ్, రాములుయాదవ్, శ్రీధ ర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యాలయ సిబ్బంది సెక్రటరీ సరోజ, సూపర్‌వైజర్ శ్రీశైలం, వినోద్, మల్లేశ్, శరత్, శ్రీశైలం, కృష్ణ, శంకర్, కరుణాకర్ తదితరులు ఉన్నారు.



రంజాన్ ఉపవాస దీక్ష క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నేతలు

## రంజాన్ ఉపవాస దీక్ష క్యాలెండర్ ఆవిష్కరణ

**తాండూరు, మార్చి 19, ప్రభాతవార్త :** ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ పురస్కరించుకొని ఉపవాస దీక్ష క్యాలెండర్‌ను రాష్ట్ర బిసి కమిషన్ సభ్యులు శుభప్రద్‌పటేల్ ఆదివారం తాండూరులో ముస్లిం పెద్దలతో కలిసి ఆవిష్కరించారు. ముస్లింలకు ముందుగానే రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగ పవిత్రతకు, త్యాగానికి చిహ్నామని, పండుగను ఆనంతోదోత్సవాలతో జరుపుకోవాలన్నారు. నెల రోజుల పాటు ఎంతో భక్తిశ్రద్దలతో నియమ నిష్టలతో ఉపావాస దీక్షలు చేపడతారని అన్నారు. అల్లా అందరికి మంచి శక్తి సామర్థ్యాలు కల్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తాండూరు మైనార్టీ నాయకులు అబిద్ చౌస్, షేక్ ఫరీద్, మహ్మద్ యూసుఫ్, హనీఫ్, వసీద్, మస్తాన్, శుభప్రద్‌పటేల్ యువసేన సభ్యులు భాను, కుర్వ బాలు, శ్రీశైలం, విజయ్, హరీష్, మురళీగౌడ్ పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కు అందజేత



సీఎం ఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు శౌకత్‌మియా

**ఘట్‌కేసర్, మారి ్చ 19, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ కొండాపూర్‌కు చెందిన కె.సరితకు ఆదివారం మున్సిపల్ కోఆప ్షన్‌సభులు ఎస్‌కె.శౌకత్‌మియా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేశారు. కొండాపూర్‌కు చెందిన సరిత అనారోగ్యంతో ఇటీవల ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా బిల్లు అధికం కావడంతో సిఎం ఆర్‌ఎఫ్‌కు ధరఖాస్తు చేసుకున్నారు. ఈమేరకు రూ.38,000లు మంజూరు కావడంతో కోఆప్షన్ సభ్యులు శౌకత్‌మియా ఆమె ఇంటికి వెళ్లి సిఎం ఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. మంత్రి మల్లారెడ్డి సహకారంతో సీఎం ఆర్‌ఎఫ్ చెక్కు మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తూ ప్రజా సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేస్తుందన్నారు.

## కాన్షీరాం సేవలు చిరస్మరణీయం: అరుణ్



ఘట్‌కేసర్‌లో అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న అరుణ్‌కుమార్, పాండురాజు

**ఘట్‌కేసర్, మార్చి 19, ప్రభాతవార్త:** ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణాలోరి పేదలకు రాజ్యాధికార కాంక్షను రగిలించి రాజ్యాధికారం వైపు నడిపించిన మహనీయుడు మాన్యవర్ కాన్షీరాం అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లడానికి 101 వ వారం నిత్యపూలమాళ కార్యక్రమం నిర్వహించారు. పోచారం మున్సిపల్ యంనంపేట్ బిజెపి నాయకులు పత్యేపు పాండురాజు విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాళలు వేసి నివాళులు అర్పించారు. మార్చి 15న మాన్యవర్ కాన్షీరాం 98వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాళ వేసి నివాళులు అర్పించారు. పీబీఐ మేడ్చల్ సమన్వయకర్త ఎం.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేద్కర్, కాన్షీరాం అందించిన సేవలను కొనియాడారు. బ్రహ్మణులు, సవర్ణ కులాల వారు కులరహిత సమాజం యొక్క సంస్కరణ కోసం ఇటాంటి సమావేశాలు నిర్వహించడం ఎప్పుడు చూడలేదని స్వప్రయో జనాన్ని కాపాడుకోవాలనే దురుద్దేశ్యంతో కులాలు ఏర్పడ్డాయని అని కాన్షీరావ మాటలను సచిన్ సూక్తిగా చెప్పాడు. ఈకార్య క్రమంలో నాయకులు తోక బాలయ్య, ఎం.రాజేశ్‌కుమార్, సగ్గు మోహన్‌రావు, సత్యం, మల్లేశ్, వెంకటేశ్వరరావు, శ్రీరామ్, రిషికుమార్, గణేశ్‌గౌడ్, ఆనంద్, రఘు, మనీష్, విష్ణు, నిఖిల్, భరత్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రానగర్‌లో పర్యటించిన బిజెపి నాయకులు

**జిల్లెడు చౌదరిగూడ, మార్చి 19,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలొని ఇంద్రానగర్ గ్రామంలో ఆదివారం బిజెపి నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పనులను వారు పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల చేస్తున్న నిధులతో గ్రామంలో పనులు చేస్తున్నట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో హరీష్, రాజు, లింగం, చంద్రమౌళి, భగవంతు, అంజి భరత్, సాయి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కారించాలి

**జిల్లెడు చౌదరిగూడ, మార్చి 19,(ప్రభాతవార్త):** గ్రామ పంచాయితీలలో పని చేస్తున్న పారిశుద్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కారించాలని జిల్లెడు చౌదరిగూడ మండల పారిశుద్య కార్మిక సంఘం అధ్యక్షుడు వీరేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్యసమాజ్ భవన్‌లో మండల పారిశుద్య కార్మికులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కార్మిక సంఘాల చట్టం 1926 ప్రకారం కార్మికుల హక్కులను అమలు చేయాలని ఆయన అన్నారు. ప్రతి కార్మికునికి తమ హక్కులపై పోరాడే హక్కు ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్, పాపన్న, ఈదమ్మ, లక్ష్మమ్మ, వెంకటమ్మ, లక్ష్మయ్య, బీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## దోమల నివారణకు ప్రత్యేక చర్యలు: చైర్మన్

**ఘట్‌కేసర్ రూరల్, మార్చి 19, ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్‌లో దోమల నివారణకుగాను ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడలోని బంధం కుంట, మిరాలం కుంటల్లో దోమల నివారణకుగాను ఆయిల్ బాల్స్ వేసే కార్యక్రమాన్ని చైర్మన్ ఆదివారం కమిషనర్ అర్ర సురేశ్‌తో కలిసి పరిశీలించారు. కురుస్తున్న వర్షాలకు దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపడుతున్నట్లు చైర్మన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు కమిషనర్ సురేశ్, బీఆర్ఎస్ నాయకులు శేఖర్ ముదిరాజ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శివారెడ్డి పాల్గొన్నారు.



సిఎం కేసిఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న దృశ్యం

## కెసిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం

**పాపన్నపేట, మార్చి 19, ప్రభాతవార్త:** టీఎస్‌పీఎస్సీ ప్రశ్న పత్రాల లీకేజి, పరీక్షల రద్దుకు నైతిక బాధ్యత వహిస్తూ టీఎస్‌పీఎస్సీ కమిటిని రద్దు చేయాలని డిమాండ్ టిపిసిసి ఆదేశాల మేరకు ఆదివారం కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ రైతు కమిటి అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిఎం కేసిఆర్ దిష్టి బొమ్మను దగ్ధం చేస్తూ నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ లక్షలాది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం వ్యాయ ప్రయసాలకు ఓర్చి కోచింగ్‌లు తీసుకుని పరీక్షలు రాస్తే కొందరు అక్రమార్కులు ప్రశ్న పత్రాలు లీక్ చేసి నిరుద్యోగుల జీవితాల్లో చికట్లు నింపారని మండిపడ్డారు. నిరుద్యోగులతో ఆటలాడుకున్న అక్రమార్కులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసిఆర్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోవింద్ నాయక్, ఎంపిటిసి సభ్యులు శ్రీనివాస్‌న, రమేష్, సతీష్, మదుసూదన్‌రెడ్డి, ప్రేమ్ రాథోడ్, ఖలీం తదితరులు ఉన్నారు.

## పెద్దమ్మ గుడి నిర్మాణానికి ముగ్గు పోత



పెద్దమ్మ గుడి నిర్మాణానికి ముగ్గు పోస్తున్న దృశ్యం

**కొల్చారం, మార్చి19 ప్రభాతవార్త:** కొల్చారంలోని కొల్చారం గ్రామ ముదిరాజ్ సంఘం కులస్తుల ఆధ్వర్యంలో ఆదివారం కొల్చారంలో ముదిరాజ్‌ల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ గుడి నిర్మాణానికి ముదిరాజ్ కులస్తులు అందరు కలిసి ముగ్గు పోయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి త్వరలోనే పెద్దమ్మ గుడిని నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నేరల్ల చంటయ్య, గ్యాస్ కృష్ణ, రాజు, నాగయ్య, శేఖులు, జూలకంటి సంగమేశ్వర్, వడ్ల ప్రభాకర్, కమ్మరి శేఖరయ్య, రాజంగారి మల్లయ్య, ముదిరాజ్ కులస్తులు తదితరులు ఉన్నారు.

## మల్లన్నస్వామిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



స్వామివారిని దర్శి ంచుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి

**కొమురవెల్లి, మారి ్చ 19, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామిని హై కోర్టు న్యాయమూర్తి వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో అలయ ఈవో బాలాజీ, పాలక మండలి చైర్మన్ గీస బిక్షపతి, అలయ ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ధర్మకర్తలు, అర్చకులు,అలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గౌడ సంఘం కొంగోడ్ గ్రామ అధ్యక్షుడిగా సత్యనారాయణగౌడ్

**కొల్చారం, మార్చి19 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొంగోడ్ గ్రామ గౌడ సంఘం అధ్యక్షులు కుకునూరి సత్యనారాయణగౌడ్‌ను ఆదివారం గ్రామంలో గౌడ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు సమావేశమైన గౌడ సంఘం సభ్యులు అలాగే ఉపాధ్యక్షులుగా దుర్గాగౌడ్, సభ్యులుగా విఠల్‌గౌడ్, కిష్టాగౌడ్, నర్సాగౌడ్, రామకృష్ణాగౌడ్, పోచాగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, సిద్ధాగౌడ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు గౌడ కులస్తులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గౌడ కులస్తులకు ఎలాంటి సమస్యలు వచ్చినా పరిష్కరిస్తానన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

**శివ్వంపేట, మార్చి19 ప్రభాతవార్త:** శివ్వంపేట మండలం దొంతి జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో 1997-98 పదవ తరగతి విద్యార్థులు 25వ వసంతం సందర్భంగా ఆదివారం దొంతి శివారులోని జీవన్ దివ్య గార్డెన్స్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఒకరినొకరు వారి జీవిత విశేషాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు షఫీయోద్దీన్, కిష్టయ్య, నిజాం షరీఫ్, రాంచంద్రం, సంజీవ్, అదేవిధంగా పూర్వ విద్యార్థులు బీఆర్ఎస్ కేవీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిల్వేరి వీరేశం, శభాష్‌పల్లి వెంకటేష్, వరుణ్, ప్రవీణ్, ఏగొండ, విఠల్, కృష్ణ, రాజు, నాగరాజు, కొండల్‌రెడ్డి, శేఖర్, వసుధ, హేమలత, ప్రసన్న, కల్పన, మిగతా పూర్వ విద్యార్థులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సిఎం కెసిఆర్, మంత్రి కెటిఆర్ దిష్టిబొమ్మల దహనం

**రాయపోల్, మార్చి 19 ప్రభాతవార్త :** టిఎస్‌పిఎస్సీలో పశ్న పత్రాలు లీకేజి కావడంతో టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ల ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి కేసిఆర్, ఐటి శాఖ మంత్రి కేటిఆర్ ల దిష్టి బొమ్మలను ఆదివారం రాయపోల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ప్రశ్న పత్రాలు లీకేజీ అయ్యాయని అన్నారు. వెంటనే సిఎం కేసిఆర్, మంత్రి కేటిఆర్ లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుధాకర్, కిష్టారెడ్డి, కృష్ణాగౌడ్, దయాకర్, అనిల్‌కుమార్, భాస్కర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు



కేసిఆర్, కేటిఆర్‌ల దిష్టిబొమ్మలను దహనంచేస్తున్న కాంగ్రెస్ నేతలు



వెల్దుర్తిలో కెటిఆర్, కెసిఆర్ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



నర్సాపూర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించి కెసిఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



రామాయంపేటలో కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



నిజాంపేటలో కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మలను దగ్ధం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

# ప్రశ్నా పత్రాల లీకేజీపై కాంగ్రెస్ నాయకుల నిరసన

**కొల్చారం, మార్చి19 ప్రభాతవార్త:** టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఆదేశాలమేరకు ప్రశ్నాపత్రాల లీకేజీపై ఆదివారం కొల్చారంలోని బస్టాండ్‌లో మెదక్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై కాంగ్రెస్ పార్టీ డిలిగేట్ సభ్యులు సోమన్నగారి లక్ష్మీరవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా, రస్తారోకో నిర్వహించిన అనంతరం సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను దహనంచేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ టీఎస పీఎస్సీ ప్రశ్నా పత్రాలు లీకేజీఅయి పరీక్షలు రద్దు కావడంతో లక్షల మంది నిరుద్యోగులు అయోమయంలో పడ్డారన్నారు. ప్రశ్నా పత్రాల లీకేజికి ప్రభుత్వ అసరమర్థతే కారణమన్నారు. కేటీఆర్ తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పక్షాన పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశం, కౌడిపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యెల్లుగారి శ్రీనివాస్‌రెడ్డి, ఘనపూర్ మల్లేశం, రంగంపేట వార్డు సభ్యులు జ్యోతి రమేష్, చందు, కొల్చారం మండల యూత్ ప్రెసిడెంట్ ప్రభాకర్, దర్జి రాజు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### వెల్దుర్తిలో...

**వెల్దుర్తి, మార్చి 19 ప్రభాతవార్త:** టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రశ్నా పత్రాల లీకేజీకి నిరసనగా వెల్దుర్తిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు మంత్రి కేటీఆర్ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, నాయకులు మల్లేశం, మహేష్‌రెడ్డిలు మాట్లాడుతూ నష్టపోయిన నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. అసమర్థ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ కిష్టాగౌడ్, నాయకులు దుర్గాగౌడ్, శంకర్‌గౌడ్, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### నర్సాపూర్‌లో...

**నర్సాపూర్, మార్చి 19, ప్రభాతవార్త:** టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజీ వ్యవహారంలో నైతిక బాధ్యత వహించి మంత్రి కెటిఆర్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కాంగ్రెస్ నాయకుల అధ్వర్యంలో నర్సాపూర్ అంబెద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించి రాస్తారోకో చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుర్రాల మల్లేషం, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, బ్లాక్ అధ్యక్షులు రిజ్వాన్ అధ్వర్యంలో సిఎం కెసిఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ధర్నాలో కెటిఆర్ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తు మంత్రి కెటిఆర్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గుప్త, మాజీఎంపిపి జ్యోతి సురేశ్‌నాయక్, ఎంపిటిసీ గుర్రాల అశోక్, ఉప సర్పంచ్‌ల పోరం మండల అధ్యక్షులు రెడ్డిపల్లి అశోక్‌గౌడ్, కాంగ్రెస్ మైనార్టీ మండల అధ్యక్షులు అజ్మత్, నాయకులు రాధాకృష్ణాగౌడ్, శ్రీశైలం యాదవ్, సురేశ్‌నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఆనంద్, ఉదయ్‌కుమార్, మల్లేష్‌యాదవ్, రవి కుమార్ గౌడ్,యువజన కాంగ్రెస్ నాయకులు ఎర్రలంజి, కాంగ్రెస్ ఎన్ఎస్‌యుఐ నాయకులు పాల్గొన్నారు.

### రామాయంపేటలో...

**రామాయంపేటమున్సిపాలిటీ, మార్చి 19, ప్రభాతవార్త:** టిఎస్‌పిఎస్‌సి పరీక్షా ప్రశ్నాపత్రాల లేకేజీని నిరసిస్తూ రామాయంపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సిఎం కేసీఆర్, ఐటీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మలను ఆదివారం మెదక్ చౌరస్తాలో దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేపర్ లీక్ కారణంగా రాష్ట్రంలోని లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ ఆగమ్యగోచరంగా మారిందన్నారు. ఇందుకు నైతిక బాధ్యత వహిస్తు మంత్రి కేటీఆర్, విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డిలు తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్యామ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు చింతల యాదగిరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్‌రెడ్డి, కౌన్సిలర్ బొర్ర అనిల్‌కుమార్, ఎంపిటిసీ మల్లన్నగారి నాగులు, పట్టణ కార్యదర్శి అల్లాడి వెంకటి, జిల్లా కార్యదర్శి బైరం కుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు భానుచందర్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు మధు, బిసి సెల్ ఉపాధ్యక్షులు రొయ్యల హరిప్రసాద్, మర్కు సతీష్ సాగర్, కుంట రాకేష్, ఎర్రం సత్యం, నేరూ, ఎల్లగారి రాజు తదితరులు పాల్గొన్నారు.

### నిజాంపేటలో...

**నిజాంపేట, మార్చి 19, ప్రభాతవార్త :** టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజీకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆదివారం నిజాంపేటలో మండల కాంగ్రెసన పార్టీ నాయకులు నిరసన చేపట్టారు. అనంతరం మండల కేంద్రలోని పాత బస్టాండ్ సమీపంలో కేసీఆర్, కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లింగంగౌడన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో పేపర్ లీక్ కారణంగా లక్షల మంది విద్యార్థులు నష్టపోతున్నారని అన్నారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తు ఐటీ శాక మంత్రి కేటీఆర్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిలు తక్షణమే రాజీనామా చేయాలని నిజాంపేట మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నసీరుద్దీన్, పంజా మహేందర్, మధుసూదన్ రెడ్డి, మోహన్‌రెడ్డి, యూత్ అధ్యక్షులు వినోద్, సులేమాన్, మ్యాదరి రాజు, ప్రవీణ్‌రెడ్డి, కాకి రాజయ్య, భూపాల్‌రెడ్డి, హబీబ, భూమాగౌడ్, నారాగౌడ్, మహేష్, చింతల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కొల్చారంలో కేసీఆర్, కేటీఆర్ దిష్టిబొమ్మలను దగ్ధం కచేస్తున్న కాంగ్రెస్ నాయకులు

# ప్రభుత్వ అసమర్థత వల్లే ప్రశ్నాపత్రం లీకేజీ

**రాయపోల్, మార్చి 19 ప్రభాతవార్త**

ప్రభుత్వ అసమర్థత నిర్లక్ష్యంతోనే టిఎస్‌పిఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీ అయిందని తెలుగుదేశం పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ ఇల్లందుల రమేష్ గుప్తా అన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ ఆదేశాల మేరకు గతంలో తెలుగుదేశంపార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులను కరపత్రాల రూపంలో ప్రచురించి రాయపోల్ మండల కేంద్రంలో ఆదివారం పల్లె పల్లెకు తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..స్వర్గీయ ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి 40 సంవత్సరాలు పూర్తి అయినట్లు తెలిపారు.బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసమే తెలుగుదేశం పార్టీని స్థాపించారని, పార్టీ స్థాపించిన తొమ్మిది నెలలకే అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాలలో నిరంకుశంగా వ్యవరిహించే పటేల్ పట్వారి వ్యవస్థను రద్దు చేసిన ఘనతే తెలుగుదేశం పార్టీదే అని అన్నారు. కూడు, గూడు, గుడ్డ అనే నినాదంతో రెండు రూపాయలకే కిలో బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. ఆ నాడు నారా చంద్రబాబునాయుడు ముందుచూపుతోనే హైటెక్ సిటిని నిర్మించాడని పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షమం కోసం అభివృద్ధి చేసిన తెలుగుదేశం పార్టీకి ఆంధ్ర పార్టీ అని ముద్ర వేసారని, మరి ఈ రోజు టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్ పార్టీగా మార్చి ఆంధ్రకు ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు.టిఎస్‌పిఎస్సీలో భారీ కుంభకోణం జరిగిందని,ఈ కుంభకోణాన్ని సిబిఐ ద్వారా విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కుంభకోణం అధికారుల కుంభకోనమా, ప్రభుత్వ కుంభకోనమా, అవినితి కుంభకోనమా అని ప్రశ్నించారు. ఐటి శాఖ మంత్రి కేటిఆర్, ముఖ్యమంత్రి కేసిఆర్ వెంటనే రాజీనామా చేసి విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.లిక్కర్ కుంభకోణంలో ఎమ్మెల్సీ కవిత ఇరుక్కోవడంతో రాష్ట్రాన్ని గాలికి వదిలేసి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉదయం ఢిల్లీలో సాయంత్రం హైదరాబాద్‌లో ప్రత్యేక్షం అవుతున్నారని అన్నారు.ఈ కుంభకోణంలో ఎమ్మెల్సీ కవిత ఎలాంటి తప్పు చేయకుంటే ఎందుకు ఈడి విచారణకు తప్పిచ్చుకొని తిరుగుతుందని అన్నారు. చట్టానికి అందరూ సమానులేనని తప్పు చేసిన వారికి శిక్ష తప్పకుండ పడుతుందని అన్నారు. రానున్న ఎన్నికలలో బీఆర్ఎస్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ అధ్యక్షులు ఆకుల రాములు, రాయపోల్ టిడిపి మండల అధ్యక్షులు మహేష్, దౌల్తాబాద్ మండల అధ్యక్షులు రమేష్‌గౌడ్, దుబ్బాక మండల అధ్యక్షులు శంకర్‌గౌడ్, అక్బర్‌పేట, భూంపల్లి మండల అధ్యక్షులు లింగం, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు భాస్కర్, దుబ్బాక నగర పంచాయితీ అధ్యక్షులు రవీందర్, దౌల్తాబాద్ మండల ప్రధాన కార్యదర్శి నర్సింలు, ఎల్లయ్య పాల్గొన్నారు



టిడిపి చేసిన అభివృద్ధి పనులను కరపత్రం రూపంలో ప్రజలకు వివరిస్తున్న నేతలు

## గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ అవార్డు అందుకున్న బంగార్ రాజు

**నర్సాపూర్, మార్చి 19.ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణ సమీపంలోనున్న బివిఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఈఈఈ డిపార్ట్‌మెంట్ లో 18 సంవత్సరాలుగా అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న జంపన్న బంగారురాజు కు డాక్టరేట్ అవార్డు రావడంతో జెఎన్‌టియు హెచ్ కన్వికేషన్ లో తెలంగాణ గవర్నర్ తమిళ్ సై చేతుల మీదుగా శనివారం బంగారు రాజు డాక్టరేట్ అవార్డు ను అందుకున్నారు తనకు ఈ అవార్డు దక్కడం ఎంతో సంతోషంగా ఉందని బంగారు రాజు తెలిపారు. ఈఅవార్డును అందుకున్న బంగారు రాజును బివిఆర్ఐటి యాజమాన్యం అభినందించింది.

మామిడి తోటలను పరిశీలించిన వ్యవసాయ అధికారి

## కోహీర్‌లో మామిడితోటల పరిశీలన

**జహీరాబాద్(కోహీర్), మార్చి 19, ప్రభాతవార్త:** ఇటీవల కురిసిన అకాల వర్షాలతో దెబ్బతిన్న మామిడి తోటలను ఆదివారం వ్యవసాయ అధికారి నవీన్ కుమార్ పరిశీలించారు. నియోజకవర్గంలోని కోహీర్ మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు మామిడి తోటలను పండిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో కాత కాసిన మామిడి కాయలు నేలరాలిపోయాయి. మండలంలోని మనియార్‌పల్లి గ్రామంలోని మామిడి చెట్లకు కాసిన కాయలన్నీ నేలరాలాయిన అధికారి నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

## వైశ్య బంధును ఏర్పాటు చేయాలి

**సంగారెడ్డి టౌన్, మార్చి 19, ప్రభాతవార్త:** పేద ఆర్యవైశ్యుల కోసం తెలంగాణ ప్రభుత్వం వైద్య బంధును ప్రవేశ పెట్టాలని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోపాజి అనంతకృష్ణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని శ్రీ వాసవి కన్యాకా పరమేశ్వరి దేవాలయంలో ఆదివారం ఆర్యవైశ్య మహాసభ జిల్లా ద్వితీయ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై అనంత కిషన్ మాట్లాడుతూ వైశ్య కార్పోరేషన్‌ను ఏర్పాటు చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున నిరాహార దీక్ష కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఆర్యవైశ్య భవన్ కోసం సంగారెడ్డిలో స్థలాన్ని కేటాయించాలన్నారు. వైశ్యులు రాజకీయంగా రాణించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవస్థాపక అధ్యక్షులు జుకంటి లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీధర్‌గుప్తకు మద్దతుగా రైతుల ఆందోళన ధర్నా రాస్తారోకో

**నర్సాపూర్, మార్చి 19, ప్రభాతవార్త:**

రైతులకు అండగా ఉంటున్న రైస్‌మిల్ శ్రీధర్ గుప్తపై అసత్యపు ఆరోపణలు చేస్తె సహించేది లేదని, ఆయనను దొంగ అని సంబోందించడం ఎంత వరకు సమంజసమని పేర్కొంటు నర్సాపూర్ మండలంలోని పలు గ్రామాల రైతులు శ్రీధర్‌గుప్తకు మద్దతుగా నర్సాపూర్ అంబెద్కర్ చౌరస్తాలో ధర్నా రాస్తారోకో నిర్వహించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా రైతులకు అండగా ఉండి శ్రీధర్ గుప్త ముక్కిపోయిన వరి ధాన్యం ను కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నాడని అన్నారు.రైతుల బాగోగులు చూస్తు అండగా ఉంటున్న శ్రీధర్‌గుప్తను మెదక్ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రపాల్ శ్రీధర్‌గుప్త పై లేనిపోని అసత్యపు ఆరోపణలు చేయడం, దొంగ అని అనడం ఎంత వరకు సమంజసమని అన్నారు.శ్రీధర్‌గుప్తను చంద్రపాల్, ఇతర రైస్‌మిల్లర్లు లేనిపోని వాఖ్యాలు చేస్తె ఖబడ్దార్ అంటు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా శ్రీధర్‌గుప్త మాట్లాడుతూ జిల్లా రైస్ మిల్లర్స్ అధ్యక్షులు చంద్రపాల్ తాను ఇతర అధికారులను చంపుతానని అసత్యపు ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. జిల్లాలో ఎన్నో రైస్ మిల్లులున్నా ఏఒక్క రైస్‌మిల్‌లో కూడ ముక్కిపోయిన వరి ధాన్యంను తీసుకోలేదని, తాను రైతులకు అండగా ఉండి ముక్కిపోయిన ధాన్యం ను తీసుకున్న తన పైతప్పుడు ఆరోపణలు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తనపై లేని పోని ఆరోపణలు చేసిన వారిపై రైతులే తగిన బద్ది చెబతారని అన్నారు. నిజాయితీగా వ్యాపారం చేస్తున్న తన పై కొందరు ఓర్వ లేక కక్షగట్టి మిల్లర్లందరు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు.మెదక్ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రపాల్ నేను చేసిన ఆరోపణలు నిజమని నిరూపించేందకు భహిరంగంగా చర్చకు సిద్దమా అని శ్రీధర్‌గుప్త సవాల్ చేశారు. ఇప్పటికైనా శ్రీదర్‌గుప్త పై అసత్యపు ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. లేని పక్షంలో రైతులు శ్రీధర్‌గుప్తకు మద్దతుగా నిలిచి మరింతగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రైతులు హెచ్చరించారు. కార్యక్రమంలో కాగజ్ మద్దూర్, ఆవంచగ్రామ రైతులు బోగ నర్సింలు, రవి. అంజయ్య,చందు, మైహిపాల్, రైతులు పాల్గొన్నారు.



నర్సాపూర్ చౌరస్తాలో ధర్నా రాస్తారోకో చేస్తున్న రైతులు



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పార్థసారధిరాజు

## సబ్ కోర్టు సాధించే వరకు పోరాటానికి సిద్ధం

**గజ్వేల్, మార్చి 19 (ప్రభాతవార్త):** సబ్ కోర్టు సాధించే వరకు న్యాయవాదుల పోరాటానికి మద్దతు ఉంటుందని సీనియర్ న్యాయవాది గోపాల్ రావు పేర్కొన్నారు. ఆదివారం గజ్వేల్ కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పార్థసారధిరాజు ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన చేపట్టారు.విషయం తెలుసుకున్న సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు గోపాల్‌రావు తమ మద్దతు తెలుపుతూ గజ్వేల్‌లో సబ్ కోర్టు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేటలో ఇప్పటికే సబ్ కోర్టు ఉండగా మళ్లీ అదనంగా ఏర్పాటు చేయడంలో ఆంతర్యమేమిటని నిలదీశారు. శిథిలావస్థలో ఉన్న భవనాలలో బిక్కుబిక్కుమంటూ న్యాయవాదులు, కక్షిదారులు, న్యాయమూర్తులు కాలం వెళ్ళదీస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనే నూతన భవన నిర్మాణాల కోసం రూ.13 కోట్ల నిధులు మంజూరు చేశారని, ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదని అన్నారు. సబ్ కోర్టు ఏర్పాటు కోసం గతంలో న్యాయవాదులు, ప్రజలు, పలు సంఘాలు శాంతియుత పద్ధతిలో నిరసన తెలుపగా మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. మంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్త, ప్రశాంత్‌కుమార్, ఎన్నెల్లి స్వామి, నరేష్‌చారి, వనం భాస్కర్, హరిశంకర్, నర్సింహ్మాచారి, ఎల్లయ్య, పోలోజు నర్సింహ్మాచారి, అబ్దుల్ గఫార్, మహ్మద్ సమీర్, బొగ్గుల సురేష్, పాండవుల కనకయ్య, కాంగ్రెస్ పార్టీ పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, మల్లారెడ్డి, బాబా, డాక్టర్ కుమారస్వామి, సురేష్, బిఎస్‌పి సిద్దిపేట జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఓంప్రకాష్, హైకోర్టు న్యాయవాది నలగామ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### నిరాహార దీక్షకు బిజెపి మద్దతు

గజ్వేల్‌కు సబ్ కోర్టు మంజూరు చేయాలని చేపట్టిన న్యాయవాదుల నిరాహార దీక్షకు గజ్వేల్ బిజెపి నాయకులు తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గ కో-కన్వీనర్ బందారు మహేష్ మాట్లాడుతూ గజ్వేల్‌లో ప్రస్తుతం ఉన్న కోర్టు శిథిలావస్థకు చేరుకుందని, సబ్ కోర్టు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గజ్వేల్‌కు రావాల్సిన సబ్ కోర్టును మంత్రి హరీష్‌రావు సిద్దిపేటకు తరలించారని, గజ్వేల్‌పై మంత్రి హరీష్‌రావుకు వివక్ష ఎందుకని నిలదీశారు. సబ్ కోర్టు మంజూరు అయ్యేంత వరకు న్యాయవాదులకు మద్దతుగా ఉంటూ బిజెపి పక్షాన సంపూర్ణ మద్దతు తెలుపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి పెండ్యాల శ్రీనివాస్, పంజాల అశోక్‌గౌడ్, ఉపాధ్యక్షుడు మైస విజయ్, బిజెవైఎం గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి నవీన్, నాయకులు ఆనందసాయి, ప్రశాంత్, అక్షయ్ పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**నర్సాపూర్, మార్చి 19 ప్రభాతవార్త:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1976, 1977 సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆనంద్ గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 46 సంవత్సరాల తరువాత ఒకేచోట కలుసుకోవడం ఒకినొకరు ఆత్మీయంగా పలుకరించుకొని బాగోగులు అడిగి తెలుసుకున్నారు. అంతేగాక అప్పటి ఉపాధ్యాయుల (గరువులు) గోపి సార్, పూర్ణయ్య సార్, నారాయణరెడ్డి సార్ రాములుసార్, శివప్రసాద్‌సార్, రుక్మయ్యసార్ లను ఘనంగా సత్కరించారు. అప్పటి జ్ఞాపకాలను గురువులతో కూడ పంచుకున్నారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బోర్లెపు శ్రీనివాస్‌గుప్త, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, పెంటారెడ్డి, కృష్ణమూర్తి, వెంకట్‌రెడ్డి, అశోక్‌గౌడ్, రామస్వామి, యాదగిరి, ఎల్లయ్య, సంగయ్య, సరళ, చంద్రకళా, అక్తర్‌కాతూమ్, బాగ్యలక్ష్మి, విజయలక్ష్మి లతో పాటు సుమారు 50 మంది పూర్వ విద్యార్థులు కలుసుకొని పూర్వ విద్యారుథ్‌ల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు.



ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్న పూర్వ విద్యార్థులు



మెటల్‌కుంటలో సిసి రోడ్డుపనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ పీటర్‌రాజు

## మెటల్‌కుంటలో సిసి రోడ్డు పనులు ప్రారంభం

**న్యాల్‌కల్, మార్చి 19, ప్రభాతవార్త:** ఎన్ఆర్ఈజిఎస్ పథకంలో రూ. 15 లక్షలతో మండలంలోని మెటల్‌కుంట గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణం పనులను సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం ప్రధాన కార్యదర్శి పీటర్ రాజు ఆదివారం ప్రారంభించారు. గ్రామంలోని 5, 6 9వ వార్డులలో రోడ్డు నిర్మాణానికి పంచాయతీ బాధ్యులతో కలిసి భూమి పూజ నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ పీటర్ రాజు మాట్లాడుతూ గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనులుచేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయితీ వార్డు సభ్యులు, నాయకులు ప్రవీణ్, శరీఫ్, సుందర్, రాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిలో చేరిన ఉప సర్పంచ్



కండువాలు కప్పి బిజెపిలోకి ఆహ్వానిస్తున్న రామచంద్రరాజనర్సింహ

**జహీరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** కోహీర్ మండలం చింతల్‌ఘట్ గ్రామ ఉప సర్పంచ్ రంగమ్మ అనుచరులతో ఆదివారం భారతీయ జనతా పార్టీలో చేరారు. బిజెపిలో చేరిన బిఆర్ఎస్ నాయకులకు ఖండువాలు కప్పి పార్టీలోకి రాష్ట్ర నేత రామచంద్ర రాజనర్సింహ సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రామచంద్ర మాట్లాడుతూ కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులపై బిజెపిలో చేరేందుకు ఆయా పార్టీల నాయకులు ఉరకలు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి నౌబాద్ జగన్, అసెంబ్లీ కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, మల్లికార్జున్ పాటిల్, సుధీర్ బండారి, పూల సంతోష్, బక్కయ్య గుప్తా, నరేస్, అనీల్ రాథోడ్, అడివన్న, ఏక్‌నాథ్‌పాటిల్, అర్చన, శారద పాల్గొన్నారు.

## రూ. 40 లక్షలతో ఫ్లడ్ లైట్ల ఏర్పాటుకు భూమి పూజ



ఫ్లడ్ లైట్ల ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

**సదాశివపేట, మార్చి 19, ప్రభాతవార్త:** పట్టణంలోని క్రీడా మైదానంలో క్రీడలను ప్రోత్సాహించేందుకు రూ. 40 లక్షలతో ఫ్లడ్ లైట్ల ఏర్పాటుకు ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్ తెలిపారు. ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు ఆదేశాల మేరకు మున్సిపల్ సాధారణ నిథులైన 40లక్షలతో పట్టణంలోని ముర్షద్ దర్గా క్రికెట్ మైదానంలో ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేస్తే క్రీడాకారులకు ప్రయోజనం చేకూరుతుందని గ్రహించి లైట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో ఇంజనీర్ రాజేశ్, నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు చింత సాయికుమార్, కౌన్సిలర్లు గుండు రవి, విద్యాసాగర్‌రెడ్డి, పులిమామిడిరాజు మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు కలీమ్ పటేల్, మాజీ కో-ఆప్షన్ సభ్యులు, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పిల్లి గుండ్ల వీరేశం, నాయకులు ముబిన్, సతాని శ్రీశైలం, ఖాజా, అయూబ్, కొత్త సోమశేఖర్, దర్గా కమిటి బాధ్యులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన తునికి శ్రీనల్లపోచమ్మ ఆలయం



పోచమ్మతల్లికి పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

**కౌడిపల్లి, మార్చి 19, ప్రభాతవార్త:** తునికి శ్రీనల్లపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివప్ప ఉతయం శ్రీ నల్ల పోచమ్మతల్లి పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేసినపిదప భక్తులకు దర్శనం కల్పించినారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోని ఒడిబియ్యంపోసి, కుంకుమార్చనలతో మొక్కులను తీర్చుకున్నారు. భక్తులు శివసత్తుల విన్యాసాల నడుమ భక్తులు బోనాలను డప్పుచప్పులతో ఆలయం చుట్టు ఊరేగించి, అమ్మవారికి బోనం నైవేద్యం సమర్పించి, జంతు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంకు విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఆసౌర్యాలు కల్గకుండ ఈఓ తన సిబ్బందితో మౌళిక వసతులు కల్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ తాళ్ల గోపాల్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, తునికి ఆలయ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు బండి సాయాగౌడు, భక్తులు పెద్ద సంఖ్య పాల్గొన్నారు.

## కౌడిపల్లిలో సిఎం కెసిఆర్ దిష్టిబొమ్మ దహనం

**కౌడిపల్లి, మార్చి 19, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ప్రభుత్వ పాలనచేస్తున్న బిఆర్ఎస్ పార్టీ నేటికి 9 సంవత్సరాలు కావస్తున్న నిరుద్యోగ సమస్యను తీర్చపోగా, ఉద్యోగ నోటిఫికేషన్ల ద్వారా ప్రభుత్వ డబ్బులు సంపాదించి,తీర పరీక్షలు నిర్వహించేనాటికి టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజ్‌తో చేతులు దులుపుకోని, నిరుద్యోగుల ఉసురుపోసుకున్న సిఎం కేసిఆర్, ఐటిమంత్రి కేటిఆర్ వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పట్లోరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం కాంగ్రెస్ అధిష్టానం పిలుపు మేరకు మండల కేంద్రమైన కౌడిపల్లిలోని 765డి జాతీయ రహదారిపై ధర్నా నిరసన కార్యక్రమం నిర్వహించి, సిఎం కేసిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగాలు ఇస్తామంటునే, మరోప్రక్క పేపర్లను లీకేజీలు చేసుకుంటు విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చినారని ఆయన అన్నారు. రద్దు చేసిన పరీక్షలను వెంటనే నిర్వహించి నిరుద్యోగ యువతకు మేలు చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈయన తోపాటు కాంగ్రెస్ యూత్ అధ్యక్షులు ధన్‌సింగ్, మొల్ల పాషా, సయ్యద్ పాషా , మాజీ సర్పంచ్ పత్యానాయక్, రమేష్, రవిందర్ నాయక్, పర్వతాలు, అరవింద్, కురగాయల రాములు, అంగవైకల్యం కల్గిన నాయకులు వీరాగౌడు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరలు పాల్గొన్నారు.



సిఎం కెసిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

# రాష్ట్రప్రభుత్వం హయాంలోనే క్రీడలకు అధిక ప్రాధాన్యత

### డిసిసిబి ఉమ్మడి మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు పట్నం మాణిఖ్యం



మాట్లాడుతున్న పట్నం మాణిక్యం

**సంగారెడ్డి బ్యూరో మార్చి 19, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ హయాంలో క్రీడలకు గతంలో ఎన్నడూ లేనంత ప్రాధాన్యం లభిస్తోందని డిసిసిబి ఉమ్మడి మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు పట్నం మాణిక్యం అన్నారు. ఆదివారం కొండాపూర్ మండలం మల్కాపూర్‌లో పట్నం మాణిక్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజవర్గం స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు ముఖ్యఅతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసంతోపాటు, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. క్రీడలలో గెలుపు ఓటములు సహజమని, ఓటమితో కుంగిపోకుండా, విజయంతో పొంగిపోకుండా ముందుకు సాగాలన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలిబాల్, క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా కార్యాక్రమాలు చేపడుతున్నామని అన్నారు. రాష్ట్రమంత్రి హరీష్‌రావు సహకారంతో జిల్లాలోని క్రీడాకారులకు ఆవసరమైన సదుపాయాల కల్పనకు కృషిచేస్తానని ఆయన చెప్పారు. సమావేశంలో బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు బీరయ్య యాదవ్, గంగానర్సిరి ఎం.డి.జిల్లా క్రికెట్ అసోసియోషన్ అధ్యక్షుడు ఎసి మోహన్, వైఎస్ఆర్‌సి తెలంగాణ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మల్కాపూర్ సోసైటీ అధ్యక్షుడు పవన్‌కుమార్, బిఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ, అనంతయ్య, నారయణ, రామ్, ప్రేమానందరం, ఎంపిటిసి శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు, నిర్వాహకులు ఫుర్ఖాన్, నాగరాజ్, ఫనీ, రవితేజ, సోహెల్, మసూద్, మురళీ, విషు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు మల్కాపూర్ చౌరాస్తా నుండి గ్రామం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పట్నం మాణిక్యాన్ని భారీ గజమాలతో సత్కరించారు. టోర్నమెంట్‌లో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 38 జట్లు పాల్గొంటున్నాయని, విజేతకు లక్ష రూపాయల నగదు బహుమతి, రన్నర్‌కు 50 వేల నగదు పురస్కారంతోపాటు, మరికొన్ని వ్యక్తిగత బహుమతులు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.



మంత్రి హరీష్‌రావును కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న సెర్ప్ ఉద్యోగులు

## మంత్రి హరీష్‌రావుకు కృతజ్ఞతలు తెలిపిన సెర్ప్ ఉద్యోగులు

**సిద్దిపేట రూరల్, మార్చి 19, ప్రభాతవార్త :** సెర్ప్ ఉద్యోగులకు కొత్త పే స్కేల్ వర్తింప చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిన నేపథ్యంలో సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన అ సంస్థ ఉద్యోగులు ఆదివారం హైదారాబాద్‌లో మంత్రి హరీష్‌రావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సెర్ప్ ఉద్యోగులకు కొత్త పే స్కేల్ వర్తింప చేయడంలో జీవో జారీ చేయడంలో కీలకంగా పని చేసిన మంత్రి హరీష్‌రావు, సిఎం కెసిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. యేండ్లుగా ఎదురుచూస్తున్న తమ కల సహకారం అయిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు సెర్ప్ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేశారు. సెర్ప్ ఉద్యోగులు అంజనేయులు, మహిపాల్, మగ్దుం అలీ, ధర్మసాగర్, చంద్రయ్య, విజయనిర్మల, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశం, శ్రీనివాస్, పంగ లింగం, కొమురయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## దూరవిద్యలో ఉన్నత అవకాశాలు సాధ్యం

**పాపన్నపేట, మార్చి 19, ప్రభాతవార్త:** దూర విద్యతో ఉన్నతమైన అవకాశాలు అందుకునే అవకాశాలు ఉన్నాయని అభ్యాసకులు దూర విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఓపెన్ స్కూల్ ఉమ్మడి మెదక్ జిల్లా సమన్వయకర్త వెంకటస్వామి అన్నారు. మండల కేంద్రమైన పాపన్నపేటలోని ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఓపెన్ తరగతులను వెంకటస్వామి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ రెగ్యూలర్‌గా పాఠశాలకు వెళ్లే అవకాశం లేని వారు దూర విద్య ద్వార విద్యను అందుకోవాలన్నారు. అభ్యాసకులు తరగతులకు విధిగా హాజరుకావాలన్నారు. ఏప్రిల్ చివరి వారంలో వార్షిక పరీక్షలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, ఓపెన్ స్కూల్ ఇంచార్జి వీరేవం, సుభాషన తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**పుల్కల్, మార్చి 19, ప్రభాతవార్త:** మండలంలోని సింగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో విద్యను అందుకుని ఆయా రంగల్లో స్థిరపడిన పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళ కార్యక్రమాన్ని ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలకు తమ కుటుంబ సభ్యులతో చేరుకున్న పూర్వ విద్యార్థులు తాము చేస్తున్న పనులపై, విద్యార్థుల చదువు, సంధ్య, వ్యాపార, ఉద్యోగ, వ్యవసాయ విషయాలపై కులాసాగా చర్చించుకున్నారు. గతంలో తమకు పాఠాలు బోధించి ఉన్నతులుగా స్థిరపడేందుకు సహకరించిన ఉపాధ్యాయులను శాలువా,పూలమాలలతో ఘనంగా సత్కరించి ఆశీర్వచనాలు అందుకున్నారు. కార్యక్రమానికి క్రిష్టారెడ్డి, సింగపూర్ సర్పంచ్ రాజాగౌడ్‌లు హాజరై పూర్వ విద్యార్థులను అభినందిస్తూ 20 సంవత్సరాలు గడిచినా పాత స్నేహతులను తలచుకుంటూ కార్యక్రమాన్ని నిర్వహించడం, అప్పటి ఉపాధ్యాయుల ఆశీర్వచాలను పొందేందుకు ఉపాధ్యాయులను ఆహ్వానించడాన్ని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, విజయరావు, రమేష్, విమల, సరస్వతీ, వినోద, కరుణ, రజిత తదితరులు పాల్గొన్నారు.



పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరుపుకుంటున్న దృశ్యం

## యువతను క్రికెట్‌లో ప్రోత్సహించడానికే కిట్ల పంపిణీ

**నంగునూర్, మార్చి 19, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అదివారం 49 క్రికెట్ జట్లకు కల్వకుంట్ల రంగారావు ఫౌండేషన్ చైర్మన్ కల్వకుంట్ల వంశీధర్‌రావు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ యువతను క్రికెట్ అటలో రాణించడానికి కిట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. క్రీడల్లో, చదువులో రాణించే వారికి ఫౌండేషన్ ఎప్పుడు అండగా నిలుస్తుందన్నారు. భవిష్యత్‌లో కుల, మతాలకు అతీతంగా ఫౌండేషన్ అధ్వర్యంలో సేవ కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో నంగునూర్ ఉప సర్పంచ్ దాసరి రవి, సురేందర్‌గౌడ్, సిద్దుల సంపత్, గిరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి : ఎమ్మెల్యే



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్ తదితరులు

**హుస్నాబాద్, మార్చి 19, ప్రభాతవార్త :** ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ వేడుకున్నారు. ఆదివారం హుస్నాబాద్ మండలంలోని పందిల్ల గ్రామంలో శ్రీమహాలింగేశ్వరస్వామి ఆలయ పునర్ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన సర్పంచ్ తోడేటి రమేష్‌తో కలసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పునర్‌నిర్మిస్తున్న ఆలయానికి రూ 2లక్షల 86వేల విలువైన ఐరన్(సలాక),సిమెంట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని దేవుడిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి లకావత్ మానససుభాష్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న తో పాటు తదితరులు పాల్గొన్నారు.

**ఆలయ పునర్‌నిర్మాణానికి భూరీ విరాళం...**

పందిల్లలోని శ్రీ మహాలింగేశ్వస్వామి దేవాలయ పునర్‌నిర్మాణం కొరకు అదే గ్రామానికి చెందిన దున్నమనేని శ్రీలతరాజేశ్వరరావులు 1లక్ష 11వేల 116రూల భూరీ విరాళాన్ని అందజేసినట్లు గ్రామ సర్పంచ్ తోడేటి రమేష్ తెలిపారు.అంతేకాకుండా తాటికొండ స్రవంతిశ్రీనివాస్‌లు రూ10వేల 116రూలు,హుజురాబాద్ మండలం తిమ్మనపల్లికి చెందిన కొక్కొండ ప్రత్యూష 2వేల నూట16రూలు అందిచినట్లు తెలిపారు.ఈ సందర్భంగా విరాళాలు ఇచ్చిన దాతలకు సర్పంచ్ రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

## అంగరంగ వైభవంగా అన్నమయ్య 520వ వర్ధంతి మహోత్సవం

**సిద్దిపేట రూరల్, మార్చి 19, ప్రభాతవార్త:** సిద్దిపేట శ్రీ అన్నమాచార్య సాంస్కృతి సంస్థ అధ్వర్యంలో శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల 520 వర్ధంతి సందర్భంగా అధ్యాత్మిక గాయకులు అన్నమయ్య పవన్ నిర్వహణలో పట్టణంలోని మోహినిపుర శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ముఖ ద్వారం ముందు కొలువైన అన్నమాచార్య స్వామి దివ్యమూర్తికి అభిషేకం, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం సాయంత్రం 7 గంటల నుంచి శ్రీ వెంకటేశ్వర స్వామి అలయ మంటపంలో ప్రముఖ గాయకుడు అన్నమయ్య పవన్‌తో పాటు వారి శిష్య బృందం వీనుల విందుగా శ్రీమత్వదీయ అంటూ అన్నమాచార్య స్వామిని స్తుతిస్తూ ప్రార్థన శ్లోకంతో సంకీర్తన గానం చేశారు. 10 రకాల సంకీర్తనలతో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామికి సంకీర్తన అర్చన చేశారు. అనంతరం హారతి ప్రసాద వితరణతో గాయని గాయకులకు దేవాలయ అర్చకుల అశీర్వపూర్వక సన్మానం నిర్వహించారు.

## న్యాయవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలి

### హైకోర్టు న్యాయమూర్తి వెంకటేశ్వర్‌రెడ్డి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** న్యాయవ్యవస్థ అనేది జోడెడ్ల బండిలాంటిదని న్యాయమూర్తులు, న్యాయవాదులు సమన్వయంతో కలిసి నడిపిస్తేనే కక్షిదారులకు సరైన న్యాయం అందుతుందని హై కోర్టు న్యాయ మూర్తి జస్టిస్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టు అవరణంలో ఏర్పాటు చేసిన అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాన్ని అయన అదివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాంతో కలిసి ప్రారంభించారు. అనంతరం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ న్యాయవస్థపై ప్రజలకు నమ్మకం కలిగేలా నడిపించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. న్యాయవ్యవస్థ పటిష్టంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. ప్రజలకు ఈ వ్యవస్థపై అపనమ్మకం కలగకుండా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది హరిశ్చంద్రను అయన సన్మానించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు భవాని, స్వాతిరెడ్డి, సల్మాఫాతిమా, శ్రావణి, సౌమ్య, ప్రియాంక,శివరంజని, కృష్ణతేజ, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ అడ్మిన్ సందెపొగు మహేందర్, బార్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు జనార్ధన్‌రెడ్డి, సత్యనారాయణ, లీగల్ ఎయిడ్ చీఫ్ డిఫెన్స్ కౌన్సిల్ బాలయ్య, న్యాయవాదులు హరిహరరావు, సాయిబాబా, బాలకిషన్, పత్రి ప్రకాష్, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పేపర్ లీకేజీకి నిరసనగా కాంగ్రెస్ నాయకుల ధర్నా



జహీరాబాద్‌లో ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**జహీరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** టీపిసిసి పిలుపు మేరకు, టీపీసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి డాక్టర్ జెట్టి గీతారెడ్డి సూచనల మేరకు నియోజకవర్గ కేంద్రమైన జహీరాబాద్ పట్టణంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నా,ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని జాతీయ రహదారిపైగల ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి బిఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం చేతకాని తనంతోనే రాష్ట్రంలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరి స్వార్థం మూలంగా ప్రశ్న పత్రాలు లీక్ కావడంతో కష్టపడి చదువకున్న అభ్యర్థుల భవిష్యత్తు నాశనమయ్యే అవకాశం ఏర్పడిందని విచారం వ్యక్తం చేశారు. ఇద్దరిని అరెస్టుచేసి చేతులు దులుపుకుంటే సరిపోదని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అసమర్థ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తన పదవికి రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు. 8 సంవత్సరాలుగా ఉద్యోగ నోటిఫికేషన్ లేదని, పరీక్ష రద్దు కావడంతో పరీక్షల కోసం శిక్షణ పొందిన అభ్యర్థుల భవిష్యత్తు ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల అధ్యక్షులు పి.నర్సింహారెడ్డి, మొహ్మద్ మక్సూద్ అహ్మద్, ఎస్‌సి సెల్ వైస్ చైర్మన్ భీమయ్య, కో-ఆప్షన్ సభ్యులు హర్షద్ పటేల్, కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు అక్బర్ హుస్సేన్, మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, మొయిజ్, నాసురుల్లాఖాన్, రాజు నాయక్, జభేర్, బాబులు, నగేష్, సుధాకర్, గోపాల్, నిజాం, రూప్‌సింగ్, ఈశ్వర్, సంగారెడ్డి, నాగిరెడ్డి, పాషా పటేల్, రాజు స్వామి, హోతి శ్రీనివాస్, జైపాల్ పాల్గొన్నారు.



ముర్కంజాలో నీటిపాలైన పంటలను పరిశీలిస్తున్న ఏఓ ప్రవీణ్‌చారి

## ముర్కంజాల్‌లో పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారి

**కంగ్టి, మార్చి 19, ప్రభాతవార్త:** మండలంలోని కంగ్టి గ్రామంలో శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పంటలు నీటిపాలయినాయి. వడగండ్లతో కూడిన వర్షం పడటంతో చేతికంది వస్తున్న పంటలు, హార్టికల్చర్ పంటలు దెబ్బతిన్నాయి. పంటలు చేతికందితే కష్టాలు దూరమవుతాయని ఆశించిన రైతులపై వరుణదేవుడు కన్నెర్ర చేయడంతో రైతు ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. గ్రామంలో వడగండ్లతో కురిసిన వర్షాలకు పంటలు నష్టపోగా ఆదివారం మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌చారి గ్రామానికి వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌చారి మాట్లాడుతూ గ్రామానికిచెందిన 302 మంది రైతులు సాగుచేస్తున్న 349 ఎకరాల్లోని పంటలకు నష్టం వాటిల్లినట్లుగా గుర్తించామన్నారు. 161 మంది రైతులు సాగు చేస్తున్న 213 ఎకరాల్లోని మొక్కజొన్న,141 మంది రైతులు పండిస్తున్న 136 ఎకరాల్లోని జొన్నపంట ఈదురు గాలులకు, వడగండ్ల దెబ్బకు, భారీ వర్షానికి నేలకొరిగాయని ప్రవీణ్‌చారి తెలిపారు. మండలంలోని 16 గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయినట్లు గుర్తించామని, ఆయా గ్రామాల్లో ఏఈఓలతో సర్వే చేయించినట్లు, మండలంలోని ఆయా గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాల నివేదికను వ్యవసాయ ఉన్నతాధికారులకు పంపనున్నట్లు వ్యవసాయ అధికారి ప్రవీణ్‌చారి పేర్కొన్నారు.

## ఉపాధ్యాయుడిని పరామర్శించిన ఎమ్మెల్సీ

**సదాశివపేట, మార్చి 19, ప్రభాతవార్త:** అనారోగ్యానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న ఉపాధ్యాయులు బిన్ శంకర్‌రావును ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, పిఆర్‌టియు జిల్లా బాధ్యులు పరామర్శించారు. పట్టణంలోని ఉపాధ్యాయులు బిన్ శంకర్‌రావు స్వగృహానికి ఆదివారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మదన్‌గోపాల్, సదాశివపేట మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రవణ్‌కుమార్, డి.ప్రవీణ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షులు పట్నం సురేందర్, సంగారెడ్డి మండల అధ్యక్షులు రామకృష్ణిరెడ్డి, వి ప్రకాశ్‌లు చేరుకుని శంకర్‌రావు ఆరోగ్య పరిస్థితిని అడగితెలుసుకున్నారు. కార్యక్రమంలో పిఆర్‌టియు నాయకులు దయానంద్, నారాయణ్‌రావు, దమేష్ కుమార్, విజయరావు, శ్రీకాంత్ జ్యోషి, సామేల్, అశోక్, మల్లికార్జున్, సడాకుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## డిడిఎస్ డైరెక్టర్ సతీష్ మృతి.... నేడు అంతక్రియలు

**జహీరాబాద్, మార్చి 19, ప్రభాతవార్త:** డిడిఎస్ డైరెక్టర్ పివి సతీష్(77) ఆదివారం ఉదయం హఠాత్మరణం పొందారు. జహీరాబాద్ పట్టణ శివారులోని పస్తాపూర్‌లోగల దక్కన్ దెవలప్‌మెంట్ సొసైటీ(డిడిఎస్)ను స్థాపించిన సతీష్ డివిజన్ ప్రజలకు సుపరిచితులే. రెండు దశాబ్దాలకుపైగా పాత పంటల జాతరను నిర్వహిస్తూ రైతులకు సతీష్ దగ్గరయ్యారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స అందుకుంటున్న సతీష్ ఆదివారం కానరాని లోకాలకు చేరిపోయారు. పివి సతీష్ అంతక్రియలు సోమవారం పస్తాపూర్ గ్రామంలో ఉదయం 10.30 గంటల ప్రాంతంలో నిర్వహించనున్నట్లు డిడిఎస్ సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది.

## ఉపాధ్యాయుల నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**సంగారెడ్డి మున్సిపాలిటి మార్చి 19, ప్రభాతవార్త:** ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 24న, కలెక్టర్ కార్యలయం ముందు చేపట్టనున్న నిరసన కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు నగారం శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి ఆనుముల రాంచెందర్‌లు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఖాళీలను భర్తీ చేయలాని, సకాలంలో జీతాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన కార్యక్రమానికి జిల్లాలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

## ఘనంగా విగ్రహా ప్రతిష్ఠాపనోత్సవం

**కౌడిపల్లి, మార్చి 19, ప్రభాతవార్త:**



విగ్రహా ప్రతిష్ఠాపనం, గ్రామ దేవతులకు పూజలు చేస్తున్న దృశ్యం

మండల పరిధిలోని కంచెన్‌పల్లిగ్రామంలో పట్లోరి ఫౌండేషన్ చైర్మెన్, ఎన్ఆర్ఐ పట్లోరి రాధ, బాలకి షన్‌రావు దంపతులు తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సొంత డబ్బులతో నూతనంగా నిర్మించిన ఆలయం లో ఆదివారం శ్రీపోచమ్మ, శ్రీరేణుకా ఎల్లమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో మూడవ రోజైన ఆదివారం చివరి రోజున గ్రామ దేశాయిపేట రాజమౌళిశర్మ వైదిక నిర్వహణలో పురోహితు దేశాయిపేట మెట్టు రామశర్మ వేదమంత్రాల మధ్య ఎన్ఆర్ఐ రాధబాలకిషన్ రావు, పౌండేషన్‌చైర్మెన్ సోదరులు శ్రీదేవి-తిరుపతి రావు, శశికళ-లింబాద్రి, కుటుంబ సభ్యుల చేతుల మీదుదా హోమం, దేవతామూర్తులకు యంత్ర ప్రతిష్ట, కళాన్యాసము, బలి ప్రదానము, మహా పూర్ణాహుతి నిర్వహింపచేశారు. అనంతరం నూతన ఆలయాలలో కొలువైన గ్రామ దేవతలకు పంచామృ తాభిషేకాలు, వస్త్రాలంకారణ, కుంకుమార్చనతో ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులకు ఉచిత అన్నవితరణ నిర్వహించారు. ఎన్ఆర్ఐ పట్లోరి బాలకిషన్‌రావుకు ఆలయం నిర్మిణాం, విగ్రహాప్రతిష్టకు సంపూర్ణ సహాకారం అందించిన గ్రామ పెద్దలకు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆలయంకు విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదా వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు హిందూ దేశంలో పుట్టిన ప్రతి వ్యక్తి మహనుబావుడేనని, కన్న తల్లిదండ్రుల రుణం తీర్చుకోని తమ జన్మకు సార్థకతను చేకూర్చుకోవడానికి ప్రతి ఒక్కరు సిద్దంగా ఉండాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వీరి తోపాటు గ్రామ ఎంపిటీసి శివకుమార్ యాదవ్, సర్పంచ్ రజని సుధాకర్ రావు, గ్రామ పెద్దలు, వేద బ్రహ్మణులు వంశీకాంత్ శర్మ, రోహిత్ శర్మ, లక్ష్మికాంత్ శర్మ, అజేయ్ శర్మ, సూచనలు, సలహాల దారుడు సర్ధన సుదర్శనం బిహెచ్ఇఎల్, గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లిక్కర్‌పై ఉన్న ప్రేమ నిరుద్యోగులపై లేదు

### -కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నాయిని యాదగిరి

**గజ్వేల్, మార్చి 19 (ప్రభాతవార్త):** లిక్కర్ మీద ఉన్న ధ్యాస విద్యపై లేదని, మంత్రి కెటిఆర్ వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నాయిని యాదగిరి, రాష్ట్ర కార్యదర్శి గోపాల్‌రావులు డిమాండ్ చేశారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వానికి లిక్కర్ వ్యాపారంపై ఉన్న వ్యామోహం నిరుద్యోగులపై లేదన్నారు. రాష్ట్రం ఏర్పడిన నుండి నిరుద్యోగులకు ఉద్యోగాల కోసం కేవలం ఒకే ఒక నోటిఫికేషన్ ఇచ్చి పేపర్ లీక్ చేసి తెలంగాణ ప్రభుత్వం తన నిజ స్వరూపాన్ని నిరూపించారన్నారు. ఉద్యోగావకాశాల కోసం ఎదిరిచూస్తున్న నిరుద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ తన కుటుంబ సభ్యులే అని గొప్పలు చెప్పున్న ముఖ్యమంత్రి కెసిఆర్ కేవలం తన కూతురు లిక్కర్ స్కాం నుండి ఎలా తప్పించుకోవాలనే ధ్యాస తప్ప రాష్ట్ర ప్రజలకు చేసిందేమీలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, దేవులపల్లి ఆంజనేయులు, ఈదుగాని శివుడు, సాయికుమార్, వంటేరు మల్లారెడ్డి, మైనార్టీ నాయకులు క్యాసారం బాబా తదితరులు పాల్గొన్నారు.